22 మందికి.. రూ.2.20 లక్షల జరిమానా

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టిబడిన వారికి వేసిన జరిమానాతో మత్తు వీడి పోయింది. డ్రంకెన్ డ్రైవ్(మద్యం తాగి వాహనం నడపడం) కేసుల్లో 22 మంది పట్టుబడ్డారు. ఈ మేరకు వారిని 3వ ఏజేఎఫ్‌సీ మేజిస్ట్రేట్ సి.రమ్య ఎదుట శుక్రవారం హాజరు పర్చారు.ఈ మేరకు ఆమె ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున 22 మందికి రూ. 2.20 లక్షల జరిమానా విధించారని ట్రాఫిక్ ఇన్‌చార్జి డీఎస్పీ కె.రమేశ్‌బాబు తెలిపారు.

ప్రతి మహిళ ఫోన్‌లో శక్తి యాప్ ఉండాలి : ఎస్పీ

రాజమహేంద్రవరం, మే 23 (ఆంధ్ర జ్యోతి): ప్రతి బాలిక, మహిళ సెల్‌ఫోన్‌లో శక్తి యాప్ ఉండే విధంగా చర్యలు తీసుకో వాలని ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశించారు. శక్తి యాప్, మహిళల రక్షణపై శక్తి టీమ్‌తో శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిం చారు. మహిళల రక్షణకు తొలి ప్రాధాన్యం ఇ వ్వాలన్నారు.జిల్లాలోని పాఠశాలలు, కళాశా లలు తదితర చోట్ల శక్తి టీమ్‌లు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. మహిళల రక్షణకే శక్తియాప్ రూపొందించామని తెలి పారు. ఇబ్బందికర పరిస్థితుల్లో ఆ యాప్‌పై టచ్ చేస్తే క్షణాల్లో పోలీసులు వస్తా రన్నా రు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీ ఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, ఎల్.అ ర్జున్ తదితరులు పాల్గొన్నారు.



హాస్టళ్ల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

డ్రాపవుట్స్‌ను గుర్తించండి

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : స్కూళ్లు తెరిచేనాటికి హాస్టళ్లలో పనులన్నీ పూర్తిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం జిల్లా సాంఘిక సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ హాస్టళ్లలోను, అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై పీవీజీటీ గ్రూపులకు గృహ నిర్మాణ పనులు చేపట్టడంపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. బడి బయట పిల్లలను గుర్తించి, డ్రాపవుట్స్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తిరిగి స్కూళ్లకు రప్పించి వారికి వసతిగృహాల్లో సీట్లు కేటాయించాలన్నారు.ఈ మేరకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. విడాకులు తీసుకున్న, విదేశాలకు వెళ్లిన మహిళల పిల్లలను, అనురక్షిత వాతావరణంలో ఉన్న ఆడపిల్లలను గుర్తించి హాస్టళ్లలో చేర్చాలన్నారు. అన్ని వసతిగృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో పీవీటీజీలుగా ఉన్న చెంచు కమ్యూనిటీకి చెందిన 399 మంది జనాభా ఉన్నారని, వీరందరికీ ఆధార్, రేషన్‌కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆరోగ్యశ్రీ కార్డులు, ఆయుష్మాన్ కార్డులు ఉన్నాయా లేవా అనేది డేటా సేకరణ చేపట్టడం కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి ఎంఎస్ శోభారాణి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి కేఎన్ జ్యోతి, బీసీ సంక్షేమ అధికారిణి బి.శశాంక, ముఖ్య ప్రణాళికాధికారి జేడీ ఎల్.అప్పలకొండ, కె.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారుల సమావేశంలో జేసీ,డీఆర్వో

తహశీల్దార్ల పనితీరుపై జేసీ అసంతృప్తి

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కొందరు తహశీల్దార్ల పనితీరు పట్ల జేసీ ఎస్.చిన్నరాముడు అసంతృప్తి వ్యక్తం చేశారు.కలెక్టరేట్‌లో శుక్రవారం రెవె న్యూ అధికారుల సమావేశంలో మాట్లాడారు. మండలాల పరిధిలో లబ్ధిదార్లకు కేటాయించిన స్థలాల్లో ఎందుకు ఇంటి నిర్మాణాలు చేపట్ట లేకపోతున్నారనే కారణాలను తహశీల్దార్లు తెలుసుకోవాలన్నారు. ఎవరూ క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదనే ఆరోపణ లు వస్తున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు.క్షేత్ర స్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు పాటించకపోతే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరిం చారు.సమావేశంలో డీఆర్వో సీతారామమూర్తి,సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మహా.. సంబరం

మినీ మహానాడు వేదికపై సుజయకృష్ణ రంగారావు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, మద్దిపాటి వెంకటరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు,నాయకులు బూరుగుపల్లి శేషారావు, రుడా చైర్మన్ బీవీఆర్ తదితరులు

- ఘనంగా మినీ మహానాడు
- వెల్లువెత్తిన నాయకులు
- పలు తీర్మానాలు ఆమోదం

రాజమహేంద్రవరం అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : జెండా మోసిన ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని.. సరైన సమయంలో వారి కష్టానికి తగిన గుర్తింపు దొరుకుతుందని తెలుగుదేశం పార్టీ జోన్ - 2 కో ఆర్డినేటర్ సుజయ కృష్ణ రంగారావు అన్నారు. రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని చెరుకూరి కన్వెన్షన్ హాలులో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి మహానాడులో ఆయన మాట్లాడారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి యర్రా వేణుగోపాల రాయుడు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని తదితరులు మాట్లాడారు. కార్యకర్తలందరి కష్టం వల్లే వైసీపీ రాక్షసపాలన నుంచి ప్రజలకు విముక్తి లభించింది. మాకందరికీ గుర్తింపు, గౌరవం దక్కింది. రాష్ట్ర పునర్నిర్మాణం, పురోభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లకు మనమందరం అండగా నిలవాలి అని పలువురు మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, సీనియర్ నాయకులు పేర్కొన్నారు. మహానాడుకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, రాష్ట్ర మహిళా కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి తురకల నిర్మల , టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు, ఎండీ అస్లాం, రాజమండ్రి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జులు పలు తీర్మానాలు ప్రవేశపెట్టగా వాటన్నింటినీ ఆమోదించారు.



ప్రాంగణంలో పసుపు తోరణం



ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చిత్రంలో సుజయకృష్ణ రంగారావు



నాయకులు, కార్యకర్తలతో కిక్కిరిసిన తూర్పుగోదావరి జిల్లా మినీ మహానాడు ప్రాంగణం

జగన్ జైలు కెళతాడు..



నేడో, రేపో మద్యం స్కాంలో వైసీపీ అధినేత జైలుకెళ్లడం ఖాయం.. రెడ్‌బుక్ అమలుకావడంలేదని కొంతమంది అనుకుంటున్నారు.రెడ్‌బుక్ తనపని తాను చేసుకుపోతోంది. జగన్మోహన్‌రెడ్డి ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నాడు. జిల్లా మహానాడు పద్ధతిగా జరగడం లేదు..ప్రొటోకాల్ పాటించడంలేదు.ఇదీ నా అభిప్రాయం.
- గన్ని కృష్ణ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మద్దతుగా నిలవాలి..



చంద్రబాబు, లోకేశ్‌కు అందరం మద్దతుగా నిలవాలి. వారి సహాయంతో రాష్ట్రంలోను, నియోజకవర్గాల్లోనూ అభివృద్ధి, సంక్షేమం అందిపుచ్చుకోవాలి.రాజమహేంద్రవరం సిటీకి గోదావరి రివర్‌ఫ్రంట్ ఒక మణిహారంగా మారుతుంది. సిటీ ఎమ్మెల్యేగా ఉన్న తన కుమారుడు దీన్ని సాధించడం ఆనందంగా ఉంది.
- ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎమ్మెల్సీ

రోడ్డుకు సీఎం చొరవ



కాకినాడ కెనాల్‌రోడ్డు శాశ్వత నిర్మాణ పనులు ప్రారంభం కావడం చాలా ఆనందంగా ఉంది. ఇప్పటికే రూ.7 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశారు. సీఎం చంద్రబాబు చొరవతో ఇది సాధ్యమైంది. ధన్యవాదాలు తెలుపుతున్నా. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు ఎన్ టీఆర్ పేరు పెట్టాలన్నారు.
- మనోజ్‌రెడ్డి, అనపర్తి ఇన్‌చార్జి

పసుపు సైనికులకు పాదాభివందనం



నియంతపాలనకు చరమగీతం పాడిన పసుపుసైనికులకు పాదాభివందనం. అక్రమకేసులు పెట్టి చంద్రబాబును 53 రోజులు జైలులో పెట్టారు. తనను, తన తండ్రి ఆదిరెడ్డి అప్పారావును అన్యాయంగా జైలులో ఉంచారు. అన్నింటినీ ఎదుర్కొని ధైర్యంగా నిలదొక్కుకున్నాం.
- ఆదిరెడ్డి శ్రీనివాస్, సిటీ ఎమ్మెల్యే

ఎన్‌టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి



తెలుగువారి ఆత్మగౌరవం, విశ్వాసానికి ప్రతీక టీడీపీ.తెలుగు ప్రజల అభివృద్ధిలో పార్టీకి విడదీయరాని అనుబంధం ఉంది. తెలుగువాడి ఆత్మగౌరవాన్ని దేశ విదేశాల్లో చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి. అక్రమ కేసులు ఎత్తివేయాలి.
- ఎం.వెంకటరాజు, గోపాలపురం ఎమ్మెల్యే

జగన్ పాలనంతా అవినీతిమయం



జగన్మోహనరెడ్డి పాలన అంతా అవినీతిమయం.ఐఏఎస్, ఐపీఎస్‌లను జైలుకు వెళ్లేలా చేసిన ఘనుడు.చంద్రబాబు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి. కొవ్వూరులో100 పడకల ఆసుపత్రి నిర్మించాలి.
- ఎం.వెంకటేశ్వరరావు, కొవ్వూరు ఎమ్మెల్యే

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు తపన



చంద్రబాబు 70 ఏళ్ల వయసులో రాష్ట్రాభివృద్ధికి అలుపెరగని శ్రమ చేస్తున్నారు. లోకేశ్ తాత, తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ పార్టీని పటిష్టపరచడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.వైసీపీలో నాశమైన వ్యవస్థలన్నింటినీ గాడిన పెట్టే ప్రయత్నం జరుగుతోంది. **-శేషారావు, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్**

పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దాలి..



ఆతిథ్యానికి మారుపేరుగా నిలిచే గోదావరి జిల్లాల్లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసుకోవాల్సి ఉంది..రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్‌గా చేయాలి. అలాగే పార్టీకి ఇప్పటి వరకూ జిల్లా ఆఫీస్ లేదు. తక్షణమే జిల్లా ఆఫీసు ఏర్పాటు చేసుకోవాలి. **- బొడ్డు వెంకట రమణ చౌదరి, రుడా చైర్మన్**

గీ..మోసం!

నేతి మిఠాయిలు.. నేతి పచ్చళ్లు.. నేతితో చేసిన పూతరేకులు.. నెయ్యి పేరు చెబితే చాలామంది ఫిదా అయిపోతారు.. ఎంత ధర అయినా పట్టించుకోరు.. కొనేస్తారు.. తినేస్తారు.. వ్యాపారులు తమ వ్యాపార విస్తరణకు ఇదే ట్రిక్ అమలు చేస్తున్నారు.. చాలాచోట్ల సక్సెస్ సాధిస్తున్నారు.. అయితే కొనుగోలుదారుడు మాత్రం ఆ వ్యాపారికి అంత నెయ్యి ఎక్కడి నుంచి వచ్చిందనేది కనీసం ఆలోచించకుండా కొనేస్తున్నాడు.. తినేస్తున్నాడు.. అనారోగ్యం పాలవుతున్నాడు.. ఆత్రేయపురం పూతరేకులు అంటే అంతా ఇంతా డిమాండ్ కాదు.. గురువారం అక్కడ 80 కిలోల కల్తీ నెయ్యి పట్టుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది..





మార్కెట్ అంతటా కల్తీ నెయ్యి

- విచ్చలవిడిగా అమ్మకాలు
- పాడి తక్కువ..ఉత్పత్తి ఎక్కువ
- వినియోగంపై కుదరని పొంతన
- నూనె,డాల్డాతో నెయ్యి తయారీ
- పూతరేకులు, స్వీట్స్‌లో వాడకం
- దేవుడి దీపారాధనదీ ఇదే తీరు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఇంకాస్త వెయ్.. అంటూ నెయ్యిని జుర్రుతున్నారా!.. ఆవకాయ పచ్చడిలో నెయ్యి ఉంటేనే గానీ ముద్ద దిగడం లేదా!.. నేతి మిఠాయిలను చూస్తే నోరూరిపోతోందా!.. ఇడ్లీ నానిపోయేలా నేతిని పోస్తున్నారా!.. అయితే ఈ కథనం మీ కోసమే. నేతి బీర పేరులో అయినా నెయ్యి ఉందేమోగానీ.. మనం వాడే నెయ్యిలో మాత్రం నెయ్యి 'నై'గానే ఉందని అధికారులు చేస్తున్న పరీక్షలు నిర్ధారిస్తున్నాయి. రంగు, వాసన, రుచి ఓకే.. కానీ అది నెయ్యేనా? అంటే సమాధానం రక్కున నీరుగారిపోవాల్సి వస్తోంది. ఇంట్లో ఓపిగ్గా తయారు చేసుకున్న నెయ్యిని జుర్రుకుంటే పర్వాలేదు. మార్కెట్‌ని ముంచెత్తుతున్న నెయ్యిని జాగ్రత్తగా గమనించి వాడకపోతే మాత్రం ఆరోగ్యం మన చేతుల్లోంచి జారుకున్నట్టే.

కల్తీ నెయ్యి తయారీ ఇలా..

నెయ్యిని రకరకాల పద్ధతుల్లో కల్తీ చేస్తున్నారు. రసాయనాలతో తయారుచేస్తున్నారు. రాజమహేంద్రవరం రూరల్ కోలమూరులో 9 నెలల కిందట నెయ్యి తయారీ కేంద్రంలో సోదాలు చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు నివ్వెరపోయారు. వంట నూనెను వేడి చేసి డాల్డాను జోడించి నెయ్యి మాదిరిగా వాసన, రంగు కోసం కృత్రిమ రసాయనాలు కలుపుతున్నారని బయట పడింది. ఆవు నెయ్యి కాస్త తెల్లగా, గేదె నెయ్యి లేత గోధుమ రంగులో ఉంటుంది. ఆ రంగులు రావడం కోసం సింథటిక్ కలర్స్ కలుపుతున్నారు. ఇలాంటి నెయ్యిని వాడితే ఆరోగ్యానికి హానికరమని వైద్యులు చెబుతున్నారు. స్వచ్ఛమైన ఆవు నెయ్యితో దీపాలు వెలిగిస్తే ఆరోగ్యం. కల్తీ నెయ్యితో దీపాలు వెలిగిస్తే వచ్చే పొగను పీల్చడం వల్ల వివిధ క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఇదీ ఒక గృహిణి లెక్క..

నెయ్యి తయారీకి ప్రధాన ముడి సరుకు వెన్న. అది పాల నుంచే వస్తుంది. ఒక అరకిలో నెయ్యి తయారు కావాలంటే సాధారణ గృహిణి లెక్కల్లో చూసినా.. గేదె పాలు రోజుకు లీటరు చొప్పున చూసుకుంటే దానికి వచ్చే వెన్న సుమారు ఓ కోడిగుడ్డు పరిమాణం ఉంటుంది. అలా నెల రోజులైన తర్వాత మరిగిస్తే ఓ అరకిలో నెయ్యి తయారవుతుంది. కానీ రోజు రోజుకూ పాడి తగ్గుతున్నా నెయ్యి మాత్రం విరివిగా లభ్యమవుతూ కిలో రూ.250కే దొరికేస్తోంది. ఇది ఎలా సాధ్యమో అధికారుల విచక్షణతో ఆలోచించాలి..

వినియోగమెంత..వచ్చేదెంత!

నెయ్యికి ముడి సరుకు అయిన పాల లెక్క చూస్తే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 2 లక్షల ఆవులు, 6 లక్షల గేదెలు ఉంటాయి. వాటిలో 60 శాతం పాలిచ్చేవిగా భావించవచ్చు. ఒక గేదె ఒక రోజుకు 6 లీటర్ల పాలు ఇస్తోందని అనుకున్నా..అంతటికీ వెన్న తీయరు. గేదె పాలు స్వచ్ఛంగా ఉంటే 9%, ఆవు పాలల్లో సుమారు 4% వరకూ ఫ్యాట్ ఉంటుంది. సుమారు 2 లక్షల గేదె పాలు, 50 వేల ఆవు పాల నుంచి వెన్న సేకరించినా దాదాపు 10 టన్నుల వెన్న వస్తుంది. దాని నుంచి 20% నెయ్యి ఉత్పత్తి అనుకున్నా 2 టన్నుల నెయ్యి మాత్రమే ఉమ్మడి జిల్లాలో ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. బయటి నుంచి వెన్న కొన్నా మరో 2 టన్నులకు మించి తయారుకాదు. కానీ డబ్బాలు డబ్బాల్లో టన్నుల కొద్దీ నెయ్యి విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో రోజుకు నెయ్యి వాడకం ఎంత ఉంటుందనే విషయం లెక్కకు చిక్కదు. ముహూర్తాల సీజన్, కార్తీక మాసం వంటి నెలల్లో నెయ్యి వాడకం ఎక్కువగా ఉంటుంది.

ఉలిక్కిపడిన.. 'ఆత్రేయపురం'

పూతరేకులకు ఆత్రేయపురం పేరుగాంచింది. బెల్లం, పంచదార పొడితో పాటు నెయ్యి వేస్తేనే పూతరేకులకు రుచి వస్తుంది. దీంతో అధిక శాతం తయారీదారులు కల్తీ నెయ్యిని వినియోగిస్తున్నారు. ఆత్రేయపురంలో గురువారం 80 కిలోల కల్తీ నెయ్యిని పక్కా సమాచారంతో రెవెన్యూ, ఫుడ్ సేఫ్టీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెయ్యిని ఆ వ్యాపారి ఎప్పటి నుంచో కిలో రూ.250కి పూతరేకుల తయారీదారులకు విక్రయిస్తున్నాడు. ఆ సొమ్ముకు స్వచ్ఛమైన గేదె నెయ్యి 100 ఎంఎల్ కూడా రాదు. ఒక్క ఆత్రేయపురంలోనే కాదు.. ఎక్కడ చూసినా నెయ్యిలో నాణ్యత మాత్రం కొరతగానే ఉంది.

తనిఖీ చేయాలని ఆదేశాలిచ్చాం..

నెయ్యి, నూనెల విషయంలో తనిఖీలు ముమ్మరం చేస్తున్నాం. అనుమానిత ప్రాంతాల్లో తరచుగా తనిఖీలు చేయాలని ఇప్పటికే ఆదేశాలిచ్చాం. అనుమతులు పొందకుండా ఎక్కడైనా వాణిజ్య పరంగా తయారు చేస్తున్నారా? అనే విషయంపై నిఘా పెట్టాం. కల్తీ పదార్థాలపై సమాచారం ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం ఇవ్వాలి.
- శ్రీనివాస్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, ఉమ్మడి తూర్పుగోదావరి

ఉమ్మడి జిల్లాలో 23 కంపెనీలు..

అధికారిక లెక్కల ప్రకారం.. కాకినాడ జిల్లాలో నెయ్యి తయారీకి 7, రీప్యాక్ 3, తూర్పుగోదావరిలో నెయ్యి తయారీకి 15, రీప్యాక్ 1, కోనసీమ జిల్లాలో తయారీకి 1, రీప్యాక్‌కి 2 కంపెనీలకు అనుమతులు ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 23 కంపెనీలు నెయ్యి తయారు చేస్తున్నాయంతే. అనుమతులు పొందకుండా వాణిజ్యపరంగా తయారు చేసే చిరు వ్యాపారులు 500 వరకూ ఉంటారని ఓ అంచనా. గతేడాది కాలంగా ఆహార భద్రత అధికారులు కాకినాడ జిల్లాలో 14 నమూనాలు సేకరించగా 3 నాణ్యత తక్కువగా ఉన్నట్టు.. ఒకటి అసలు వాడడానికి పనిచేయదని రిపోర్టులు వచ్చాయి. కోనసీమలో 2, తూర్పుగోదావరిలో ఐదులో 2 హానికరమైనవని తేల్చారు. అయినా చర్యల్లేవ్.. చట్టంలో ఉన్న లొసుగులు వ్యాపారులకు వరంగా మారాయి. ఫుడ్ సేఫ్టీ అధికారులు సరిపడా లేకపోవడం అనుకూలతగా మారింది. ఉమ్మడి తూర్పులో ఒక పర్యవేక్షణాధికారితో కలిపి కేవలం ఆరుగురు మాత్రమే ఫుడ్ సేఫ్టీ శాఖకు అధికారులు ఉన్నారు.వీరికి వాహనం ఉండదు. తూర్పుగోదావరి జిల్లాలో ఒకే ఒక్క అధికారి ఉన్నారు. దీంతో మూడు పువ్వులు.. ఆరు కాయలుగా కల్తీ వ్యాపారం సాగిపోతోంది.

పన్ను పోటు తగ్గింది!





చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

- దిగిరానున్న హరిత పన్ను
- హామీ నెరవేర్చిన చంద్రబాబు
- జిల్లాలో లక్షలాది వాహనాలు
- 9 లక్షల మందిపై పన్నుపోటు
- 24.30 కోట్ల వరకు ఊరట
- గత వైసీపీలో బాదుడే బాదుడు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ప్రజలను ఎడాపెడా పన్నులతో బాదేయడమే పనిగా పెట్టుకున్న గత వైసీపీ ప్రభుత్వం ఏటా వాహనదారుల నుంచి కోట్లలో పిండేసింది. హరితపన్ను పేరుతో రోడ్డెక్కిన ప్రతి వాహనం నుంచి డబ్బులు గుంజేసింది. జేబులు గుల్లచేసేసింది. ఎట్టకేలకు ఈ హరితపన్ను దోపిడీ నుంచి వాహనదారులకు ఉపశమనం లభించింది. గత జగన్ పాలనలో వాహనాలపై రూ.20 వేల వరకు విధించిన హరితపన్ను రాష్ట్ర ప్రభుత్వం భారీగా తగ్గిస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది. ఇకపై ఆయా వాహనాల కేటగిరీ ఆధారంగా రూ.1,500 నుంచి రూ.3 వేల వరకు మాత్రమే వసూలు చేయడానికి అంగీకరించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాదాపు 9 లక్షల మంది వాహనదారులకు పన్ను బాదుడు తప్పనుంది. అత్యధికంగా ఉమ్మడి జిల్లాలో 55 వేల వరకు ఉన్న లారీలకు భారీగా మేలు చేకూరబోతోంది.

రూ.200 నుంచి రూ.20 వేలకు..

గత టీడీపీ ప్రభుత్వంలో వాహనం రిజిస్ట్రేషన్ జరిగిన తేదీ నుంచి ఏడేళ్లు దాటితే రూ.200 వరకు మాత్రమే కట్టించుకునేవారు. అయితే కాలం చెల్లిన వాహనాలు తగ్గించే ఉద్దేశంతో కేంద్రం హరిత పన్నులు పెంచుకునేలా రాష్ట్రాలకు అవకాశం ఇచ్చింది. ఇదే అదనుగా గత వైసీపీ ప్రభుత్వం అన్ని రకాల వాహనాలపై 2022 జనవరి 1 నుంచి హరిత పన్నును భారీగా పెంచేసింది. అప్పటి వరకు ఉన్న రూ.200 పన్నును వివిధ శ్లాబ్‌లుగా విడదీసి లారీలు, టిప్పర్ల నుంచి రూ.20 వేల వరకు పిండేసింది. ప్యాసింజర్ వాహనాలు, స్కూలు, కాలేజీ బస్సులు, మ్యాక్సీ క్యాబ్స్, ఓమ్నీ బస్సులు వంటి వాటికి రూ.6 వేలు, చివరకు ఆటోలు, బైక్‌లు, క్రేన్‌లు, ట్రాక్టర్లపైనా భారీగా పన్ను పెంచేశారు. పెరిగిన పన్ను భారం భరించలేక వీరంతా ఆందోళనలు చేశారు. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో 55 వేల వరకు లారీలు ఉండగా వీటిపై కోట్లలో పన్ను భారం పడింది. కాకినాడ జిల్లా వరకు చూస్తే 2.94 లక్షల వాహనదారుల నుంచి జగన్ ప్రభుత్వం హరితపన్ను పిండేసింది. తూర్పుగోదావరి జిల్లాలో 2.10 లక్షలు, కోనసీమ జిల్లాలో 1.80 లక్షల వాహనాలపై కలిపి కోట్లలో పన్నులను జగన్ ప్రభుత్వం పిండేసింది. ఏడేళ్లు, పదిహేనేళ్లు దాటిన కేటగిరీ పేరుతో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి పన్నులు వసూలు చేశారు.

నాడు హామీ ఇచ్చి.. నేడు..

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రచారాలకు వెళ్లిన సమయంలో హరితపన్ను దోపిడీ నుంచి బయటపడేయాలని లారీ యజమానులు కోరారు. ప్రభుత్వం మారగానే పన్ను బెడద తగ్గిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ మేరకు రవాణా, రవాణాయేతర వాహనాలపై హరిత పన్నును తగ్గిస్తూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. కేబినెట్ సైతం పన్ను తగ్గింపుపై తీర్మానం చేసింది. ప్రస్తుతం ఉన్న హరితపన్నును భారీగా తగ్గిస్తూ ఆయా వాహనాల కేటగిరీ, వయస్సు ఆధారంగా రూ.1,500 నుంచి రూ.3 వేల వరకు మాత్రమే వసూలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఒకరకంగా చెప్పాలంటే రూ.24.10 కోట్ల వరకు ఉమ్మడిజిల్లా వాహనాలపై పన్ను భారం దిగనుంది. అత్యధికంగా కాకినాడ జిల్లాలో 2.94 లక్షల వాహనాలపై రూ.9 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 2.10 లక్షలు వాహ నాలపై రూ.8.10 కోట్లు, కోనసీమలో 1.80 లక్షల వాహనాలపై రూ.7 కోట్ల వరకు పన్ను భారం తగ్గుతున్నట్టు అధికారులు అంచనా.





వాడపల్లిలో స్టాల్ పెట్టి వడియాల విక్రయం

నోరూరించేలా..

ఏ ఇంట చూసినా వడియాల తయారీలో మహిళలు బిజీ

కమ్మని రుచులను రుచి చూపిస్తున్న గోదారోళ్లు

ఆత్రేయపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): కోనసీమ ప్రకృతి అందాల సోయగాలకే పరిమితం కాదుసుమీ. కమ్మని పచ్చళ్లు, నోరూరించే పిండి వంటలకు పెట్టింది పేరు. అతిథులు ఇంటికి వస్తే గోదారోళ్ల అప్యాయత, అనురాగాలతో పాటు కమ్మని రుచులను రుచి చూపిస్తారు. ప్రస్తుత వేసవిలో పచ్చళ్లు పెట్టడంలో గోదారోళ్లు బీజీబీజీగా ఉన్నారు. మండే ఎండల్లో గుమ్మడి వడియాలు, పిండి వడియాలు, మజ్జిగ మిరపకాయలు, పెసర వడియాలు తయారుచేసే పనిలో నిమగ్నమయ్యారు. ఏడాది పాటు తినేందుకు ఈ వడియాలను తయారు చేసుకుంటారు. బంధుమిత్రుల ఇళ్లకు పచ్చళ్లతో పాటు వడియాలపై పంపిస్తుంటారు. పప్పుచారు-వడియాలు కాంబినేషన్ ఎంతో రుచికరంగా ఉంటుంది. నాన్‌వెజ్ ప్రియులు ఎంతో ఇష్టంగా రకరకాల వడియాలను అమితంగా భుజిస్తారు. వివిధ రకాల వడియాలను మహిళలు వ్యాపారంగా మలుచుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. వాడపల్లి, లొల్ల గ్రామాల్లో స్టాల్స్ పెట్టారు. గుమ్మడి వడియాలు, మజ్జిగ మిరపకాయలు కిలో రూ.400, పిండి వడియాలు, చిప్స్ కిలో రూ.300 చొప్పున అమ్మకాలు సాగిస్తున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన వారు వీటిని కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. వారు రుచి చూసి మరలా వచ్చేటప్పుడు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంత మహిళల వడియాల తయారీ వ్యాపారం విరాజిల్లుతోంది.



గుమ్మడి వడియాలు



మజ్జిగ మిరపకాయలు



పిండి వడియాలు




రెడ్ అలెర్ట్

ఈ చిత్రాల్లో ఇళ్ల ముందు కన్పిస్తున్న ఎర్ర రంగు నీళ్ల సీసాలను చూస్తున్నారు కదూ.... వీటి వెనుక చిన్న కథ వుంది.. కాకినాడ జగన్నాథపురం వాసులను వీధి కుక్కలు భయపెడుతున్నాయి. వాటి బారి నుంచి తప్పించుకోవడానికి ఎం చేయాలా అని ఆలోచించారు. యూట్యూబ్‌లో వైరల్ అవుతున్న ఓ వీడియో వారి కంటపడింది. పూణేలోని ఓ ప్రాంతంలో ఇదే తరహాలో వీధి కుక్కలు విజృంభించడం మొదలెట్టాయి. దీంతో వారంతా ఎర్ర రంగు నీళ్లు కలిపి సీసాల్లో పోసి వారి నివాసాల ముందు పెట్టారు. దీంతో కుక్కల బెడద 90 శాతం తగ్గింది. దీంతో జగన్నాథపురం ప్రజలూ అదే టెక్నిక్‌ను ఫాలో అయ్యారు. ఇంకేముంది ఇక్కడా కుక్కలు ఇళ్ల ముందుకు వచ్చి అరిస్తే ఒట్టు.

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ







సహజసిద్ధ సిలైన్ కొబ్బరిబొండం

కొబ్బరిబొండంలో షోషకాలు మొండు

మండు వేసవిలో చల్లదనాన్నిచ్చే కొబ్బరి బొండాలు

అంబాజీపేట, మే 18(ఆంధ్రజ్యోతి): అది చెరకురసంలా తియ్యగా ఉండదు... పోనీ మామిడి పండు రసంలా నోరూరించదు.. శీతల పానీయంలా చల్లగానూ ఉండదు. అయినా బోలెడంత ఆరోగ్యానిస్తుంది. వేసవి తాపాన్ని పూర్తిగా తీరుస్తుంది. ఏడాది పొడవునా కొబ్బరి బొండాలు దించినా వేసవిలో మాత్రం వీటికి ఎక్కడలేని డిమాండ్ ఉంటుంది. చాలా మందికి రోజుకు ఒక బొండం తాగినిదే దాహం తీరదు. కాస్త తియ్యగా, ఒకింత ఉప్పగా, కొంచెం వగరుగా ఉండే లేత కొబ్బరి నీరు అద్భుతమైన పానీయం. దప్పికను, అలసటను చిటికెలో మాయం చేసే ఉత్తేజాన్నందించే పోషకసేవనం. ఏకైక రక్షిత సహజ శీతల పానీయం. ఈ కొబ్బరి బొండం తాగమని ఏ ప్రముఖ సినీనటులు, క్రీడాకారులు కోట్లు తీసుకుని కూల్ డ్రింక్స్ మాదిరిగా ప్రచారం చేయరు. చేయనవసరమూ లేదు. వైద్యులు, సూచనలతోపాటు విద్యావంతులు, సామాన్యులు కొబ్బరి బొండం విశిష్టతపై అవగాహన పెంచుకోవడంతో రోజురోజుకు వీటి వినియోగం విపరీతంగా పెరుగుతుంది.

కొబ్బరి బొండాలలో రకాలు

ప్రకృతి సిద్ధంగా పెరిగే కొబ్బరి బొండాలలో సుమారు మూడు రకాలున్నాయి. మొదటి రకాన్ని గంగా బొండాలని అంటారు. ఈ బొండాలలో కొబ్బరి ముక్క చాలా మందం తక్కువగా ఉండి, అధిక నీళ్లతో చాలా తియ్యగా ఉంటుంది. ఈ బొండంలో సుమారు 250 మిలీ నుండి 300 మి.లీల వరకు నీళ్ళు కలిగి ఉంటాయి. అయితే ఈ గంగా బొండాలు చాలా అరుదుగా దొరుకుతాయి. రెండవ రకానికి చెందిన బొండాలు ఈస్ట్‌కోస్ట్‌టాల్. ఈ బొండాలు ఎక్కువగా దొరుకుతాయి. ఇవి రెండు, మూడు రంగులలో కనిపిస్తుంటాయి. వీటిలో నీళ్ళు తక్కువగా ఉండి కొబ్బరి ముక్క మందంగా ఉండి ఎండు కొబ్బరికాయలుగా వినియోగించుకోవడానికి బాగా ఉపయోగపడుతుంది. ఈ బొండాలనే వివిధ ప్రాంతాలకు అధికంగా రవాణా చేస్తుంటారు. మూడవ రకానికి చెందిన బొండాలు మలేషియా ఎల్లోడార్ఫ్(హైబ్రీడ్ బొండాలు) ఈ బొండాలు పసుపుపచ్చ రంగులో ఉండి దీనిలో కొబ్బరి ముక్క మందం చాలా తక్కువగా నీళ్ళు అధికంగా ఉంటాయి. ఇవీ కోనసీమ పరిసర ప్రాంతాలలో ఈ చెట్లు అరుదుగా ఉంటాయి. దీనికి సంబంధించిన విత్తనం మల్లేషియాకు చెందినది కావడంతో ఈ కొబ్బరి చెట్లు మలేషియా ఎల్లోఆర్ఫ్ అని పిలుస్తారు. మరికొందరు హైబ్రిడ్ కొబ్బరి బొండాలని అంటారు.

కొబ్బరి బొండం ఓ సహజ సిలైన్

మనిషికి సిలైన్‌బాటిల్‌లా నేరుగా శక్తినిచ్చే గుణం కొబ్బరి బొండంలోనే ఉంది. అందుకనే దీన్ని సహజసిలైన్ అంటారు. ఇది ఎమర్జన్సీ గ్లూకోజ్‌గా ఉపయోగపడుతుంది. దీని లో విటమిన్లు, ఖనిజలవణాలు, ఆరోగ్య దాతు లక్షణాలు కలిగి ఉంటాయి. ఆనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఈ బొండం నీళ్ళు ఎంతో ఉపశమనాన్నిస్తాయి. ఎందుకంటే ఇవి సహజంగానే సెర్టిలైజ్డ్ మినరల్ వాటర్. ఎలాంటి మలినాలు, సూక్ష్మజీవులు ఉండవు. బొండం నీళ్ళు తాగితే మనిషి ఒక పూట భోజనం చేస్తే కలిగే బలాన్నిస్తుంది. వేసవికాలంలో ఈ బొండాలకు మంచి గీరాకి ఉంటుంది. అప్పుడు, ఇప్పుడు అనే కాలపరిమితి ఏమి లేకుండా నిత్యం కొబ్బరి బొండాలు లభిస్తాయి. వేసవి తాపాన్ని తట్టుకోలేక సహజ సిద్ధంగా తయారు చేసిన శీతల పానీయం కంటే కొబ్బరి బొండాలు తాగడానికిఏ అందరే ఇష్టపడతారు. నిగనిలాడుతూ పచ్చగా కనిపిస్తూ అందరిని ఆకట్టుకుంటే వాటిలో దాగి ఉన్న నీళ్ళు వేసవితాపం నుంచి సేదతీరుస్తాయి. కొన్ని దేశాల్లో లేతకొబ్బరినీళ్ళను టిన్‌ల్లో ప్యాకింగ్ చేసి విక్రయిస్తుంటారు అమెరికాన్ ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ అసోసియన్ కొబ్బరి నీళ్ళు మూడు వారాలపాటు నిల్వ ఉండేలా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఓ ప్రత్యేక క్యాన్‌ను తయారు చేసింది. అటువంటివి మనకు అందుబాటులోకి వస్తే కూల్‌డ్రింక్‌లు కనమరుగవ్వడం తప్పదు.



కొబ్బరి బొండంలో ఉండే పోషకాలు

లేత కొబ్బరి బొండంలో 90 శాతం నీరే. ఒంటిని చల్లబర్చే గుణాలు ఇందులోనే ఎక్కువ. ఇది జీర్ణ వ్యవస్థనను బాగు చేస్తుంది. కాస్త లేత కొబ్బరి కట్టినదే మధ్య వయస్కు బొండం. ఇందులోని నీళ్లలో పోషక శాతం ఎక్కువ. పిండి పదార్థాలు, ఖనిజాలు, ఫాస్పరస్, విటమిన్ ఎ,డి,సిలు మిగిలిన రెండింటిలో కన్నా ఎక్కువ. కొబ్బరి బాగా కట్టినదే పక్వదశ. జీర్ణశక్తి పెద్దగా లేని వారు ఈ దశలోనే కొబ్బరిని ఎక్కువగా తినడం మంచిదికాదు. అందుకే మూడింటిలోకి లేత, మధ్య వయసు బొండాలు శరీరంలోని వివిధ రకాల కణజాలాల పెరుగుద పనితీరుకు తోడ్పడతాయి. 100గ్రా లేత కొబ్బరి నీళ్లలో పోషక విలువలు. శక్తి 17.4 శాతం, నీరు 95.5 శాతం, కార్బోహైడ్రేట్స్ 4.4 శాతం, ప్రోటీన్‌లు 0.01 శాతం, క్రొవ్వు 0.01 శాతం, నైట్రోజన్ 0.05 శాతం, ఫాస్పారిక్‌యాసిడ్ 0.56 శాతం, పోటాషియం 290 మి.గ్రా, కాల్షియం 44 మి.గ్రా, సోడియం 44 మి.గ్రా, మేగ్నీషియం 10 మి.గ్రా, ఫాస్పరస్ 9.2 మి.గ్రా, ఐరన్ 106 మి.గ్రా, కాపర్ 26 మి.గ్రాలు బొండంలోని పోషక విలువలు.

వెంకన్న ఆలయాభివృద్ధికి మాస్టర్ ప్లాన్



కమిషనరుకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఉపకమిషనరు

- దేవదాయశాఖ కమిషనరు రామచంద్రమోహన్
- త్వరలోనే డార్మెటరీ, వసతి గదుల నిర్మాణానికి చర్యలు
- ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, మే 23(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మాస్టర్ ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి ఆలయ అభివృద్ధి ప్రణాళికపై సుదీర్ఘంగా చర్చించారు. పార్కింగ్ ప్రదేశాలు, శ్రీనివాస ఆలయ ప్రాంగణం, ఆలయ తిరువీధులు, అన్నదాన భవనం, క్షేత్రంలో పర్యటించి భక్తులకు అందిస్తున్న సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. కొద్దినెలల నుంచి వాడపల్లి క్షేత్రం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. భక్తుల రద్దీ రోజురోజుకు పెరుగుతోందని, ప్రతి శనివారం 50వేల నుంచి 60వేల మంది భక్తులు స్వామిని దర్శించుకుంటున్నారన్నారు. దూరదృష్టితో అభివృద్ధి ప్రణాళిక ఏర్పాటు చేసి మాస్టర్ ప్రణాళికను ఆమోదిస్తామన్నారు. అందుకే ఈ క్షేత్రాన్ని స్వయంగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకున్నట్టు కమిషనర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించారన్నారు. అత్యవసర పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేస్తామన్నారు.దేవస్థానం నిధులతో డార్మెటరీ నిర్మాణం, తాత్కాలిక అన్నదాన షెడ్, 50 వసతుల గదుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టిసారించామని త్వరలోనే మంజూరు ఉత్తర్వులు అందిస్తామన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని, సీఎం చంద్రబాబు వేగంగా అభివృద్ధి చెందుతున్న క్షేత్రంపై తమ వద్ద చర్చించారన్నారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందన్నారు. రానున్న కాలంలో క్యూ కాంప్లెక్స్ నిర్మాణం కంపార్ట్‌మెంట్లు, స్లాట్ సిస్టమ్ అమలు చేయాల్సి ఉందన్నారు. స్థల సమస్య నేపథ్యంలో కొన్ని గృహాలు ఖాళీ చేయాల్సి ఉందని, వారితో మాట్లాడి చర్యలు చేపడతామన్నారు. అనంతరం దేవదాయ శాఖ ఈఈ దుర్గేష్, డీఈ జె.శ్రీనివాస్, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావుతో అభివృద్ధి పనులపై చర్చించారు. తహశీల్దారు రాజేశ్వరరావు పాల్గొన్నారు.

శత్రువైనా! వృత్తి ధర్మం పాటించాలి



కొత్త పరిమళం నాటికలో ఓ సన్నివేశం

- ఆకట్టుకున్న కొత్త పరిమళం నాటిక
- రామవరంలో జాతీయ స్థాయి సాంఘిక నాటిక పోటీలు

అనపర్తి, మే 23 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరంలోని నల్లమిల్లి మూలారెడ్డి కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 36వ జాతీయ స్థాయి సాంఘిక నాటిక పోటీలు మూడో రోజైన శుక్రవారం కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రదర్శించిన విడాకులు కావాలి, కొత్త పరిమళం, నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటికలు ఆకట్టుకున్నాయి.

దాంపత్య జీవితంలో ఒడిదుడుకులు, చిన్న చిన్న మనస్పర్థలు రావడం సహజమని, దంపతులు వాటిని ఎదుర్కొనాలే గాని విడాకుల కోసం పరుగులు తీయడం సరైన పద్ధతి కాదని సాటి చెప్పే కథాంశంతో సాగిన విడాకులు కావాలి నాటిక ఆకట్టుకుంది. భార్యాభర్తలు మనసు విప్పి మాట్లాడుకోవడం ద్వారా అనేక సమస్యలు సమసి పోతాయంటూ తాడేపల్లికి చెందిన అరవింద్ ఆర్ట్స్ ప్రదర్శించిన నాటిక ప్రేక్షకులను అలరించింది.

భారత దేశ సరిహద్దులో విధులు నిర్వర్తిస్తున్న మిలటరీ వైద్యుడు, సరిహద్దు పొరుగు దేశంలో కాన్పు కష్టమై ప్రాణాపాయ స్థితిలో ఉన్న గర్భిణిని కాపాడేందుకు వెళ్లి ప్రసవం తరువాత భారత సరిహద్దులోకి ప్రవేశించే సమయంలో పాకిస్తాన్ మిలటరీకి చిక్కుతాడు. వైద్యుడిని బందీగా తీసుకెళ్లాలన్న పాక్ మిలటరీ అధికారి.. వైద్య ధర్మం కోసం తన ప్రాణాలకు తెగించి పొరుగు దేశం బోర్డరుకు వచ్చి వైద్యం అందించిన వైద్యుడి మనసును అర్థం చేసుకుని క్షేమంగా బోర్డరు దాటిస్తారు. వృత్తి ధర్మాన్ని కళ్ల కట్టినట్టు బొరివంకకు చెందిన శర్వాణి గిరిజన సాంస్కృతిక సేవా కేంద్రం కొత్త పరిమళం నాటికను ప్రదర్శించింది.

రచయితలుగా ఉన్న ఇద్దరు మిత్రులు తమ పిల్లలకు వివాహం జరిపిస్తారు. అయితే భార్యాభర్తల మనస్సులు కలవకపోవడంతో విడిపోయే పరిస్థితికి చేరుకుంటారు. భార్య మరొకరికి దగ్గరవుతుంది. వివాహేతర బంధం మోజులో కూతురిని చంపేస్తుంది. ఆమెపై భర్త ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో భర్తే ఆమెను నరికి, ఆమె తలతో పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోతాడు. వివాహేతర బంధం మానవ సంబంధాలను చిన్నాభిన్నం చేస్తుందన్న కథాంశంతో విశాఖపట్నానికి చెందిన తెలుగు కళా సమితి ప్రదర్శించిన నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది.

కొవ్వూరులో వ్యక్తి ఆత్మహత్య

కొవ్వూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉరి పోసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కొత్తపాలేనికి చెందిన ఓలేటి ధర్మారావు(50).. భార్య, ముగ్గురు కొడుకులతో నెలరోజుల క్రితం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం పంగిడి గ్రామంలోని దండమూడి సాయి ఇంటి వద్ద పని నిమిత్తం వచ్చి ఇక్కడే మకాం ఉంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 2:30గంటల సమయంలో మకాం ఉండే పాకలో రుమాలుతో ధర్మారావు ఉరిపోసుకుని ఆత్మత్య చేసుకున్నాడు. పెద్ద కోడలు కుమారి చూసి వెంటనే కిందకు దింపి అక్కడే ఉన్న సతీష్ సహాయంతో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు ధ్రువీకరించారు. ఆసుపత్రి సమాచారం, మృతుడి భార్య గంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

బీ-ఆర్క్, బి-ప్లాన్ ఫలితాల్లో తిరుమల ప్రభంజనం





రామ్‌సాయి వరుణ్‌రెడ్డి, యశ్వంత్ సాత్విక్

రాజమహేంద్రవరం రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ (మెయిన్స్) బీ-ఆర్క్, బీ-ప్లాన్ ఫలితాల్లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లోని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్టు విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. బీ-ఆర్క్ జనరల్, ఈడబ్ల్యూఎస్ విభాగంలో కె.యశ్వంత్ సాత్విక్ ఆలిండియా 1వ ర్యాంకు, వి.రామ సాయి వరుణ్ రెడ్డి 4వ ర్యాంకు సాధించారన్నారు. బీ-ప్లాన్ విభాగంలో వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయిలో కె.యశ్వంత్ సాత్విక్ 3వ ర్యాంకు, వి.రామసాయి వరుణ్ రెడ్డి 3వ ర్యాంకు, టి.షణ్ముఖ శ్రీనివాస్ 24వ ర్యాంకు, టి.జశ్వంత్ దొర 63వ ర్యాంకు, వై.సాయితేజ, టి.పవన్ శ్రీకుమార్‌చౌదరి 78వ ర్యాంకు, సుంకర జోషిచంద్ 99వ ర్యాంకు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్‌తో కలిసి అభినందించారు.

చైన్ స్నాచర్ అరెస్టు

రూ.13 లక్షల విలువైన

130గ్రాముల బంగారం స్వాధీనం

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): 12 చైన్ స్నాచింగ్ కేసుల్లో నిందితుడిగా ఉన్న తాడిమళ్ల గ్రామానికి చెందిన దేశాల ప్రవీణ్‌ని శుక్రవారం అరెస్టు చేశామని త్రీటౌన్ సీఐ వి.అ ప్పారావు తెలిపారు. కోడిపందేలు, జల్సాలకు అలవాటుపడి అతడు దొంగతనాలు చేస్తున్నాడన్నారు. చోరీ సొత్తును కొంత కాలం తన వద్దే ఉంచుకొని.. కొద్దిరోజుల తర్వాత విక్రయిస్తుంటాడన్నారు. ఈ క్రమంలో రాజమండ్రి వస్తుండగా అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. సుమారు రూ.13 లక్షలు విలువ చేసే 130గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసులో ప్రతిభ చూపిన డీఎస్పీ కె.రమేశ్‌బాబు, సీఐ అప్పారావు, ఎస్ఐ వి.అప్పలరాజు, సీసీఎస్ సీఐ శ్రీధర్ కుమార్, ఎస్ఐలు ఆనందరెడ్డి, బీఎస్‌కే స్వామి, హెచ్‌సీలు ప్రసాద్, వెంకట రమణ, పీసీ సురేశ్‌లను ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించారు.

ప్రశాంతంగా ఈఏపీసెట్ ఇంజనీరింగ్ పరీక్ష

రెండు సెషన్లలో 9 కేంద్రాల్లో నిర్వహణ.. 4,447 మంది విద్యార్థుల హాజరు

జేఎన్టీయూకే, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఈఏపీసెట్-2025 ఇంజనీరింగ్ ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష శుక్రవారం కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రశాంతంగా జరిగిందని కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించామన్నారు. మూడు జిల్లాల్లోని 9 కేంద్రాల్లో రెండు సెషన్లలో మొత్తం 4,592 మంది విద్యార్థులకు 4,447 మంది హాజరు కాగా 145 మంది గైర్హాజరయ్యారన్నారు. కాకినాడ జిల్లాలో 96.93 శాతం, తూర్పు గోదావరి జిల్లాలో 97.34 శాతం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 95.42 శాతం హాజరు నమోదైందని కన్వీనర్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు శనివారం కూడా కొనసాగుతాయన్నారు.

కూనవరం, చింతూరు మీదుగా


భద్రాచలం సర్వీసుల మళ్లింపు

మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌తో ఆర్టీసీ ముందుజాగ్రత్త

రాజమహేంద్రవరం అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బస్వరాజ్, మరికొందరు మావోయిస్టు ముఖ్యనేతల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారుల నుంచి అందిన సమాచారంతో జిల్లా ఆర్టీసీ ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. పోలీసు ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో భద్రాచలం రూటులో ఆర్టీసీ అధికారులు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ప్రధానంగా గోకవరం మీదుగా భద్రాచలం నడిచే అన్ని బస్సు సర్వీసుల రూట్లలో మార్పులు చేశారు. ఏడుగురాళ్లపల్లి మీదుగా సర్వీసులను తిప్పకుండా కూనవరం, చింతూరు రూటులో మళ్లించారు. గోకవరం డిపో నుంచి వయా ఏడుగురాళ్లపల్లి మీదుగా భద్రాచలం ఎక్కువ సర్వీసులు నడిచేవి. రాజమహేంద్రవరం డిపో నుంచి ఒక సర్వీసు మాత్రమే గోకవరం రూటులో వెళుతోంది. ఈ సర్వీసు రూటును కూడా వయా కూనవరం, చింతూరుకు మార్పు చేశారు. అలాగే, సీలేరు వెళ్లే సర్వీసులను వీలైనంత త్వరగా వెనక్కి తీసుకురావడం చేయాలని, ఒక వేళ నైటవుట్స్ ఉంటే ప్రయాణీకులను దింపేసిన తర్వాత ఆ బస్సులను సమీప పోలీస్‌స్టేషన్‌కు తరలించాలని ఆర్టీసీ అధికారులకు పోలీసుల నుంచి ఆదేశాలు వెళ్లినట్టు సమాచారం. తదుపరి ఆదేశాలు వచ్చే వరకూ ఈ జాగ్రత్తలు పాటించాలని పోలీసుల నుంచి ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు వచ్చినట్టు చెబుతున్నారు.

ప్రకృతి వ్యవసాయం.. మొలకలెత్తిన ధాన్యం

కొనుగోలు చేయాలని రైతు అభ్యర్థన



మొలకెత్తిన ధాన్యం రాశి

తాళ్లరేవు, మే 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలోని పి.మల్లవరం కృషి అమృత్ గో ఆధారిత వ్యవసాయ క్షేత్రంలో పండించిన ఆర్ఎస్ఆర్ రకం ధాన్యం కల్లంలో ఉండిపోయి ఇటీవల కురుస్తున్న వర్షాలకు మొలకలెత్తింది. రైతు ధూళిపూడి వెంకటరమణ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మొలకలు వచ్చిన ధాన్యాన్ని ఎటువంటి షరతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసే రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలన్నారు.

రేపు స్విమ్మింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కాకినాడ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ కార్య దర్శి ఇరుసుమళ్ల రాజు

సామర్లకోట, మే 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 1న పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరుగనున్న అంతర్ జిల్లాల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు గాను క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ ఈ నెల 25న సామర్లకోట దుర్గాప్రసాద్ పాఠశాలలో జరుగనున్నట్టు కాకినాడ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ కార్యదర్శి ఇరుసుమళ్ల రాజు శుక్రవారం విలేకరులకు తెలిపారు. 15 ఏళ్ల వయస్సు నిండిన బాలబాలికలు అంతర్ జిల్లాల ఈత పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. వీరికి ఈ నెల 25న ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ పాఠశాలలోని ఈతకొలనులో ఎంపిక కార్యక్రమాన్ని నిర్వ హించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల బాలబాలికలు ఈ ఎంపికలో పాల్గొనవచ్చని రాజు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ సీజీఎం ప్రత్యేక పూజలు



వేదాశీర్వచనం పొందుతున్న సీజీఎం దంపతులు

సామర్లకోట, మే 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో బీఎస్ఎన్ఎల్ సౌత్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజరు పి.మురళీమోహన్ సతీసమేతంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయానికి చేరుకున్న సీజీఎం మురళీమోహన్ దంపతులకు ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలోని అన్ని ఉపాలయాలను దర్శించిన సీజీఎం దంపతులు భీమేశ్వరస్వామికి అభిషేక పూజలు, బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన నిర్వహించారు. నంది మండపం వద్ద వేదాశీర్వచనంతో ప్రసాదాలు, స్వామివారి, అమ్మవారి చిత్రపటాలను ఈవో నీలకంఠం చేతులమీదుగా అందజేసారు. ఈ సందర్భంగా పలువురు బీఎస్ఎన్ఎల్ అధికారులు పాల్గొన్నారు.

కొవిడ్‌ను ఎదుర్కొనేందుకు సన్నద్ధం

- వైరస్ హెచ్చరికలతో అప్రమత్తం
- కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు


కాకినాడ జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కొవిడ్ వార్డు


సిబ్బందికి సూచనలు ఇస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్

జీజీహెచ్(కాకినాడ) మే 23 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కొన్ని రోజులుగా కొవిడ్ కేసులు అనూహ్యంగా పెరుగుతుండంతో పాటు మన రాష్ట్రంలోని విశాఖపట్నంలో తాజాగా ఒక పాజిటివ్ కేసు నమోదు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం కొవిడ్ నియమాలను అమలులోకి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో బోధనాసుపత్రి అయిన కాకినాడ జీజీహెచ్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కొవిడ్ వార్డు ఏర్పాటు చేశారు. ఈఎన్‌టీ విభాగంలో ఏర్పాటు చేసిన కొవిడ్ ఐసోలేషన్ వార్డును డాక్టర్ విఠల్ సందర్శించి ఏర్పాట్లపై వైద్యులు, సిబ్బందితో సమీక్షించారు. వెంటిలేటర్లు, ప్రత్యేక పడకలు, ఆక్సిజన్ సరఫరా, పీపీఈ కిట్లు, మాస్కులు, గ్లౌజుల లభ్యతను పరిశీలించారు. విఠల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను అనుసరిస్తూ ప్రత్యేక కొవిడ్ వార్డు ఏర్పాటు చేశామన్నారు. రోగులను అప్రమత్తం చేయడానికి అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం రోజుకు సుమారు 10 కొవిడ్ టెస్టులు చేస్తుండగా, హైరిస్క్ గ్రూపులకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ప్రభుత్వం సూచనల మేరకు ముందస్తు జాగ్రత్త చర్యలుగా కొవిడ్ టెస్టింగ్ శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సామాజిక బాధ్యతతో ముందుగానే కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ 5వేల ఎన్95 మాస్కులను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. కరోనా వైరస్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జీజీహెచ్ యంత్రాంగం పూర్తి సన్నద్ధంగా ఉందన్నారు. పల్మనాలజీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసన్, అనస్థీషియా వైద్య నిపుణులను బృందాలుగా చేసి నియమించామని వారు 24 గంటలూ సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో మాస్క్ తప్పనిసరిగా ధరించడం, శానిటైజేషన్ చేయడం, తరచూ చేతులు కడుక్కోవడం, శానిటైజర్లు ఉపయోగించడం తప్పనిరని డాక్టర్ విఠల్ తెలిపారు. భౌతిక దూరం కనీసం ఆరు అడుగులు ఉండేలా పాటించడం అవసరం. గోరువెచ్చని నీటిని పుక్కిలించడం, వేడి ఆహారాన్ని భుజించడం, వేడి పానీయాలు సేవించడం తప్పనిసరి. అనుమానిత వ్యక్తులు తక్షణం టెస్టులు చేయించుకోవాలన్నారు. జ్వరం, దగ్గు, శ్వాసకోస ఇబ్బందులు ఉన్నవారు వెంటనే అర్హత కలిగిన వైద్యుడిని సంప్రదించాలన్నారు. అర్హులైన వారికి వ్యాక్సిన్ బూస్టర్ డోసులు వేయించాలని ప్రభుత్వం సూచించింది. సాధ్యమైనంత వరకు భారీ ప్రదర్శనలు, సమావేశాలను నివారించాలి. అత్యవసరమైతేనే తప్ప బయటకు వెళ్లకపోవడం శ్రేయస్కరం. వీటిని పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని విఠల్ పేర్కొన్నారు.

పాము పడగ వలే..



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం రాజులపాలెం గ్రామంలో రైతు పేరిచర్ల నాగరాజు పొలంలో కంద దుంపకు పాము పడగవలే పువ్వు విరిసింది. అబ్బురపరిచే విధంగా ఉన్న దుంపతో కూడిన ఈ పువ్వును చూడటానికి స్థానికులు ఆసక్తి కనబరుస్తున్నారు.

పి.గన్నవరం (ఆంధ్రజ్యోతి)

పుట్టగొడుగు భలే..



అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం పెద్ద భీంపల్లి మూడు ఆర్‌అండ్ ఆర్ కాలనీ కొండమొదలు గ్రామం సమీపాన పొలంలో 8 అంగుళాల పొడవు, 8 అంగుళాల వెడల్పుతో పుట్ట గొడుగు వెలిసింది. దీంతో అటుగా వెళ్లే వారు దీన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

దేవీపట్నం (ఆంధ్రజ్యోతి)

గిరిజన సలహా మండలిలో రంప ఎమ్మెల్యే

రంపచోడవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఛైర్‌పర్సన్‌గా 16మంది సభ్యులతో గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మండలిలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవికు చోటు దక్కింది. ఆమెతో పాటు పోలవరం ఎమ్మెల్యే చిర్రా బాలరాజు, పాడేరు ఎమ్మెల్యే ఎమ్.విశ్వేశ్వరరాజు, అరకు ఎమ్మెల్యే రేగా మత్స్యలింగం వంటి వారు గిరిజన సంక్షేమ కార్యదర్శి, గిరిజన సంక్షేమ డైరెక్టర్ సభ్యులుగా ఈ మండలిలో కొనసాగుతారు. గిరిజన ప్రాంతాలకు అవసరమైన చట్టాలు, విధానాల రూపకల్పనతో పాటు ఎటువంటి సవరణలు చేయాలన్నా ఈ గిరిజన సలహా మండలి ఆమోదం తప్పనిసరిగా కావాలి.

మోటార్‌సైకిల్ అదుపుతప్పి.. అంతులేని విషాదాన్ని నింపి..

- హైవే స్తంభాలను ఢీకొని తల్లి మృతి
- తండ్రీకొడుకులకు తీవ్రగాయాలు
- కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి వద్ద ఘటన

తొండంగి, మే 23 (ఆంధ్రజ్యోతి): మరికొద్ది క్షణాల్లో ఇంటికి చేరుతారనగా ఓ ప్రమాదం కుటుంబంలో అంతులేని విషాదాన్ని నింపింది. మోటార్‌సైకిల్ అదుపుతప్పి తల్లి అక్కడికక్కడే మృతిచెందగా తండ్రి, కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా తొండంగి మండలం గోపాలపట్నం గ్రామానికి చెందిన సాగి ఆనంద్ హైదరాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. తండ్రి మానసిక ఆరోగ్య పరిస్థితి బాగుండకపోవడంతో శుక్రవారం ఉదయం తల్లి అమ్మాజీ(45)తో కలిసి కాకినాడలో ఓ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అనంతరం కాకినాడ నుంచి మోటార్ సైకిల్‌పై తిరిగి గోపాలపట్నం వస్తుండగా బెండపూడి పోలవరం కాల్వ సమీపంలో మోటార్‌సైకిల్ అదుపుతప్పి రోడ్డును ఆనుకుని ఉన్న హైవే స్తంభాలను ఢీకొంది. దీంతో వెనుక కూర్చున్న అమ్మాజీ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. సూరిబాబు, ఆనంద్‌కు తీవ్రగాయాలు కావడంతో వారిని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అన్నవరం గ్రామం పొలిమేర వరకూ వెళ్లినవారు మరికొద్ది క్షణాల్లో ఇంటికి చేరుతారనగా జరిగిన ప్రమాదం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. తొండంగి ఎస్‌ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఫైల్‌ఫొటో
మరణించిన అమ్మాజీ


ఆనంద్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

అన్నవరం దేవస్థానం ఏఈవోకు షోకాజు నోటీసులు

అన్నవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మంచిర్యాల నుంచి విచ్చేసిన సేవకుల పట్ల దురుసుగా ప్రవర్తించిన కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఏఈవో కొండలరావుకు ఈవో సుబ్బారావు శుక్రవారం షోకాజు నోటీసులు జారీ చేశారు. బధ్యతయుతమైన ఉద్యోగంలో ఉంటూ క్రిమినల్ కేసులు పెడతాం, తక్షణం కొండ దిగి వెళ్లిపోవాలని అనడం ఏమిటని ప్రశ్నించారు. తనపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో 5రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ అంశంపై దేవదాయ కమిషనర్ సైతం ఆగ్రహం వ్యక్తం చేయడం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం తునికి చెందిన శ్రీవారి సేవకుల సంఘం తరుపున దుర్భాషలాడిన ఇద్దరి మహిళలను ఈవో కార్యాలయానికి పిలిపించారు. డిప్యూటీ కమిషనర్, సహాయ కమిషనర్‌లు వారిపై విచారణ చేపట్టి సమాచారం తీసుకుని స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. వారిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.

హైడ్రా క్రేన్ ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ మృతి

సర్పవరం జంక్షన్, మే 23 (ఆంధ్రజ్యోతి): విధులు ముగించుకుని నడచుకుంటూ ఇంటికి వెళ్తున్న పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌ని వెనుక నుంచి హైడ్రా క్రేన్ ఢీకొనడంతో మృతి చెందాడు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వాకలపూడికి చెందిన మాతా అప్పలరాజు (57) స్థానిక పంచాయతీలో 2014 నుంచి కాంట్రాక్ట్ శానిటేషన్ వర్కర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ట్రాక్టర్ నడిపి చెత్తా, వ్యర్థాలను డంపింగ్ యార్డులో వేసి ట్రాక్టర్‌ను పంచాయతీ కార్యాలయం వద్ద ఉంచి ఇంటికి నడచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనకాల నుంచి వస్తున్న హైడ్రా క్రేన్ అప్పలరాజుని ఢీకొంది. తీవ్ర గాయాలతో రక్తస్రావంతో అపస్మారకస్థితిలో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్‌ని స్థానికులు మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ వాహనంలో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే మార్గమధ్యం లో మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వారిలో ఓ కుమార్తెకు వివాహం చేయాల్సి ఉంది. కుటుంబ యాజమాని మృతిచెందడంతో భార్య, కుమార్తెలు మృతదేహంపై పడి కన్నీరు మున్నీరుగా విలపించారు. అప్పలరాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. జీజీహెచ్ ఔట్ పోస్ట్ పోలీసుల సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సర్పవరంఎస్‌ఐ శ్రీనివాస్‌కుమార్ తెలిపారు.


అప్పలరాజు మృతదేహం

పర్యాటకానికి వచ్చి గుండెపోటుతో మృతి

మారేడుమిల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మారేడుమిల్లి పర్యాటక ప్రాంతానికి వచ్చిన వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. జంగారెడ్డిగూడెనికి చెందిన తమ్మిన జగదీశ్వరరావు (55) గురువారం మారేడుమిల్లి ప్రాంతానికి వచ్చి సాయంత్రం సమయంలో పాములేరువాగు సమీపంలో తన కారు పక్కగా అచేతన స్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గమనించి మారేడుమిల్లి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ సీహెచ్.గోపాలకృష్ణ, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు సేకరించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. జగదీశ్వరరావు జంగారెడ్డిగూడెంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. దీనిపై మారేడుమిల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియాసుపత్రికి తరలించారు.


మరణించిన జగదీశ్వరరావు

గంజాయితో ఐదుగురి అరెస్ట్


ఆలమూరులో వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్‌ఐ

ఆలమూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆలమూరు పోలీసులు శనివారం గంజాయితో ఐదుగురిని అరెస్టు చేసినట్లు కోర్టులో హాజరుపరిచారు. ఈ వివరాలను ఆలమూరు పోలీస్‌స్టేషన్‌లో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్ విలేకర్లకు వివరించారు. గంజాయితో ఉన్నట్టు సమాచారం రావడంతో పెదపళ్ల శివారు శ్మశానవాటిక వద్ద దాడి చేసి కడియం మండలం మురమండకు చెందిన నూకపెయ్యి దిలీప్, ఆలమూరు మండలం పెదపళ్లకు చెందిన చాపల ప్రసన్నకుమార్, పల్లి కార్తీక్‌కుమార్, కపిలేశ్వరపురం మండలం తాతపూడికి చెందిన ఉందుర్తి ఆనంద్‌కుమార్, కడియం మండలం దుళ్లకు చెందిన మెండి రవికుమార్‌లను అరెస్ట్ చేశారు. ఒక్కొక్కరి వద్ద 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని వారిని కోర్టులో హాజరుపరచినట్టు పేర్కొన్నారు.

తిమ్మాపురంలో బైక్‌ల దొంగ అరెస్ట్

సర్పవరం జంక్షన్, మే 23 (ఆంధ్రజ్యోతి): బైక్‌లను చోరీ చేస్తున్న యువకుడు పోలీసులకు చిక్కాడు. తిమ్మాపురం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వలసపాకలకు చెందిన రచ్చా బొబ్బులు అనే సతీష్‌కుమార్ (20) చెడు వ్యసనాలు, జల్సాలకు అలవాటు పడి పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో బైక్‌ల చోరీలకు పాల్పడాడు. సీఐ డీఎస్ చైతన్యకృష్ణ నేతృత్వంలో తిమ్మాపురం ఎస్‌ఐ ఆర్‌వీఎన్ మూర్తి ఆధ్వర్యంలో క్రైం పార్టీ సిబ్బందితో రాబడిన సమాచారం మేరకు నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం తిమ్మాపురం వై.జంక్షన్ సమీపంలో సతీష్‌కుమార్‌ను అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ ఆర్‌వీఎస్.మూర్తి తెలిపారు. నిందితుడిని విచారించగా గతంలో అతడిపై పిఠాపురం, సర్పవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీ కేసులు, సామర్లకోటలో గంజాయి కేసులు ఉన్నాయన్నారు. ఎన్టీఆర్ న్యూ బీచ్‌లో మరొక మోటార్ బైక్ చోరీకి పాల్పడినట్లు, అలాగే వెంకట్ అనే మరో వ్యక్తితో కలసి అచ్చంపేట ఏడీబీ రోడ్డులో టెంపుల్‌లో హుండీలో రూ.2000 నగదు కాజేసినట్టు తెలిపారు. 2బైక్‌లు, రూ.2000 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ చెప్పారు.

నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళం


ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం విజయవాడకు చెందిన సాయిబాబా, వెంకట సత్యవాణి దంపతులు రూ.2,00,116 విరాళంగా ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేశారు. ఆయన దాతలను అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు.

స్పైరల్ కేసింగ్ పనులు పూర్తి

పొల్లూరు జల విద్యుత్ కేంద్రం మేనేజర్


ఆరో యూనిట్ పనులను పర్యవేక్షిస్తున్న దృశ్యం

మోతుగూడెం, మే 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలోని 6వ యూనిట్‌కు సంబంధించి స్పైరల్ కేసింగ్ పనులు పూర్తయ్యాయని ప్లాంట్ మేనేజర్ బి.బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో ఆరో యూనిట్ స్పైరల్ కేసింగ్ పనులు పూర్తి కావడంతో శుక్రవారం స్పైరల్ కేసింగ్ హైడ్రోలిక్ టెస్టింగ్ నిర్వహించగా విజయవంతంగా ముగిసిందని తెలిపారు. 5, 6 యూనిట్లకు సంబంధించిన స్పైరల్ కేసింగ్ పనులు పూర్తి కావడంతో యూనిట్లకు సంబంధించి టర్బైన్ స్టాటర్ జనరేటర్ విభాలకు సంబంధించిన పనులను ప్రారంభిస్తారని చెప్పారు. ఇటీవల జనరేటర్ స్టాటర్ విభాగాకు సంబంధించిన యంత్రాలు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని బీహెచ్ఈఎల్ భోపాల్ నుంచి పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో ఈ 2 యూనిట్లు అందుబాటులోకి వస్తే పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో మరో 230 మెగావాట్ల సామర్థ్యం పెరగనుందని పేర్కొన్నారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో 5, 6 యూనిట్లు ఈ ఏడాది చివరి నాటికి వినియోగంలోకి వచ్చేలా పనులు శరవేగంగా చేయిస్తున్నామన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

పిఠాపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): టైల్స్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కార్మికుడు మరణించాడు. ఒడిశా రాష్ట్రంలోని కలహండి ప్రాంతానికి చెందిన బలదేవ్ మాజీ (55) కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలో టైల్స్ పనిచేస్తున్నాడు. శుక్రవారం పిఠాపురం బైపాస్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటికి టైల్స్ అతికిస్తూ ఎలక్ట్రికల్ బోర్డుపై ఉన్న స్విచ్ వేస్తున్న సమయంలో కరెంటు షాక్‌కు గురై అక్కడిక్కడే మరణించాడు. సహచర కార్మికుల ఫిర్యాదుతో పిఠాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.80 లక్షల నిధులు దారిమళ్లింపు

ది ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ సభ్యుల ఆరోపణ

కార్పొరేషన్ (కాకినాడ), మే 23 (ఆంధ్రజ్యోతి): గత నాలుగేళ్లలో ప్రతిభ గల క్రీడాకారుల భవిష్యత్తును కాలరాస్తూ ది ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఏసీఏ నుంచి సుమారు రూ.80 లక్షల నిధులు దారి మళ్లించారని అసోసియేషన్ సభ్యులు బాపిరాజు, సత్యస్వరూప్, నగేష్ ఆరోపించారు. కాకినాడ జయా రెసిడెన్సీలో అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం ప్రెసిడెంట్ డాక్టర్ శివకుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గల వివిధ జోన్ల నుంచి ప్రెసిడెంట్, సెక్రటరీలు హజరైయ్యారు. శివకుమార్ మాట్లాడుతూ గత నాలుగేళ్లగా అసోసియేషన్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలను సభ్యుల ముందుంచి అభిప్రాయాలను తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ఏ ఫార్మట్లోను టోర్నమెంట్ నిర్వహించకపోగా ఇతర టోర్నమెంట్లలో పాల్గొనే క్రీడా కారులను పక్కనపెట్టడం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేకాకుండా ప్రతిభను పక్కనపెట్టి డబ్బులిచ్చి జట్టులో వేయడం వంటి వాటికి స్వస్తి పలికేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ జోక్యం చేసుకుని ఇక్కడ అవినీతిపై విచారణ జరిపించి దోషులపై చర్యలు చేపట్టాలని కోరుతూ తీర్మానం చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి సుమారు 40 మంది సభ్యులు హాజరై తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. మాజీ సెక్రటరీ కె.బాపిరాజు, మాజీ వైస్ ప్రెసిడెంట్ ఎ.ఎస్.స్వరూప్, రాజమండ్రి ఇన్‌చార్జి విజయకుమార్ బాబు, కోనసీమ ఇన్చార్జి ఎవిటి.వర్మ పెద్దాపురం ఇన్‌చార్జి, ఎ.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సభ్యులు

కొబ్బరిపీచు ఫ్యాక్టరీలో ప్రమాదం

కడియం, మే 23 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం దుళ్ల గ్రామంలో కొబ్బరిపీచు ఫ్యాక్టరీలో శుక్రవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించింది. సత్యసాయి ఇండస్ట్రీస్ అధినేత కృష్ణసాయికి చెందిన ఫ్యాక్టరీలో జరిగిన ఈ ప్రమాదంలో విద్యుత్ సామాన్లు, ఫైబర్ మెటీరియల్ పూర్తిగా కాలిపోయాయని, సు మారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని కృష్ణసాయి తెలిపాడు. కార్మికులు సెలవు పెట్టడంతో కొద్ది రోజులుగా ఉత్పత్తి నిలిపివేశామని, త్వరలో ఉత్పత్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని, రాత్రి మెటీరియల్ తీసుకువచ్చి ఉంచామన్నారు. ప్రమాదం ఏ విధంగా సంభవించిందో తెలియడం లేదన్నాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో వెంటనే వచ్చామని, మండపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసినట్టు పేర్కొన్నాడు.


కాలిపోయిన విద్యుత్ పరికరాలు

వేడి నీరు పడి..

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గొల్లప్రోలు, మే 23 (ఆంధ్రజ్యోతి): వేడి నీరు పడడంతో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మరణించాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని శివం హోటల్‌లో పొడికోడి కృష్ణన్ పద్మనాభన్ (53) అనే రవి కొంతకాలంగా పనిచేస్తున్నాడు. ఈనెల 13న వేడినీటి గిన్నెను దింపుతుండగా ప్రమాదవశాత్తు మీద పడింది. వేడి నీరు పడటంతో తీవ్రంగా గాయపడిన అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్టు పోలీసులు తెలిపారు. మృతుడి అన్న కృష్ణన్ ఫిర్యాదుపై గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త అరెస్ట్

గొల్లప్రోలు రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో భార్యపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన భర్తను గొల్లప్రోలు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. తాకట్టులో ఉన్న సెల్‌ఫోన్ విడిపించుకునేందుకు డబ్బులు అడగా లేవనిచెప్పిన భార్య జ్యోతిపై ఆగ్రహంతో భర్త కిలాడి శ్రీను పామాయిల్ గెలలు కోసే కత్తితో దాడి చేశాడు. శ్రీనును శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ రామకృష్ణ చెప్పారు.

వాగులోకి స్నానానికి వెళ్లి బాలుడి మృతి


సీలేరు వాగులో బాలుడి మృతదేహం

మోతుగూడెం, మే 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న సీలేరు వాగులోకి స్నానానికి వెళ్లిన ఓ బాలుడు మరణించాడు. మర్రిగూడెం గ్రామానికి చెందిన పి.సంతోష్‌కుమార్(15) ఈనెల 21న సీలేరు వాగులోకి స్నానానికి వెళ్లాడు. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అదే గ్రామానికి చెందిన ధర్మారావు సీలేరులో చేపల వేటకు వల వేయగా శుక్రవారం అందులో చిక్కాడు. దీనిపై డొంకరాయి పోలీసులు కేసు నమోదు చేశారు.

గోదావరిలో జారి పడి వ్యక్తి మృతి

అమలాపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైనతేయ నదీ తీరం అల్లవరం మండలం గోపాయిలంక మొండి వద్ద లంకలో ఒక వ్యక్తి మృతదేహన్ని శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ టి.తిరుమలరావు తెలిపారు. అంబాజీపేట మండలం వాకలగరువు గ్రామానికి చెందిన సుంకర దుర్గాప్రసాద్ (44) సోమవారం బోడసకుర్రు శివాలయానికి అని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి గోపాయిలంక మొండి వద్ద గోదావరి గట్టు వద్ద మోటారుసైకిల్ పెట్టి బహిర్భూమి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ గోదావరిలో జారి పడి మరణించాడని, మృతదేహన్ని కుటుంబ సభ్యులు గుర్తించారని ఎస్‌ఐ పేర్కొన్నారు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తిరుమలరావుఎస్‌ఐ చెప్పారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆటో బోల్తా

నలుగురికి గాయాలు

సామర్లకోట, మే 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం ఉండూరు శివారు బ్రహ్మానందపురం మండల పరిషత్ పాఠశాల ఎదురుగా రైల్వే కార్మికులతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును, విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన 12 మంది కార్మికులు కడియం వద్ద రైలు ట్రాక్ పనుల నిమిత్తం ఆటోలో వెళ్లి పనులు పూర్తి అనంతరం తిరిగి ఉండూరు మీదుగా దుర్గాడ వెళ్తుండగా బ్రహ్మానందపురం సమీపించేసరికి ఆటో నడుపుతున్న డ్రైవర్‌కు రెప్పపాటు కారణంగా ప్రమాదం జరిగినట్టు ప్రత్యక్షసాక్ష్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మిగిలిన గాయపడిన ముగ్గురికి స్థానికంగా ప్రాథమిక చికిత్స నిర్వహించారు. ప్రమాదంలో విద్యుత్ స్తంభం ఛిద్రం అయ్యింది. సామర్లకోట విద్యుత్ లైనమెన్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ వార్డు సభ్యుడు దాడి

కేసు నమోదు

అన్నవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల విషయంలో జరిగిన టీడీపీ కార్యకర్తపై వైసీపీ వార్డు సభ్యుడు దాడి చేయడంతో కొట్లాట కేసు నమోదు చేసినట్టు అన్నవరం ఎస్‌ఐ హరిబాబు తెలిపారు. వివరాల్లోకి వెళితే కాకినాడ జిల్లా అన్నవరంలో ఉపాధిహామీ పనుల జరిగే చోటకు టీడీపీకి చెందిన సిరపరపు కృష్ణ వెళ్లి ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీదేవిని పనులు కేటాయింపు, కొలతలపై ప్రశ్నించగా వారిద్దరి మధ్య స్వల్ప వివాదం జరిగింది. శ్రీదేవి వైసీపీ వార్డు సభ్యుడి సింగంపల్లి రాముకు విషయం చెప్పడంతో రాము, కృష్ణల మధ్య కొట్లాట జరగడంతో అన్నవరం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గాయాలపాలైన కృష్ణను తుని ప్రభుత్వా సుపత్రికి తరలించి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

సబ్సిడీపై దాణా పంపిణీ

పెరవలి, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి మంజూరైన దాణాను ఖండవల్లిలో పశు వైద్యాధికారి సల్మా పలువురు ప్రజాప్రతిని ధులతో కలిసి రైతులకు అందజేశారు. రూ.1110 విలువైన 50 కిలోల బస్తాను 50శాతం సబ్సిడీపై రూ.550కే రైతులకు ఇస్తున్నామన్నారు. తొలివిడతగా ఖండవల్లి, అన్నవరప్పాడు, నల్లాకులవారిపాలెంలో పంపిణీ చేశామన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

నాటు మందులు వాడొద్దు : డీఎంహెచ్‌వో



ఒడియా క్యాంపును సందర్శిస్తున్న డీఎంహెచ్‌వో

మోతుగూడెం, మే 23(ఆంధ్రజ్యోతి): నాటు మందులు వాడకూడదని డీఎంహెచ్‌వో జలీల్ భాష విజ్ఞప్తి చేశారు. వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ మంగపాడు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు, కొత్తగా నిర్మిస్తున్న డెలివరీ విభాగాన్ని పరిశీలించారు. అక్కడున్న సమస్యలపై మంగంపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి వనజను అడిగితెలుసుకున్నారు. మోతుగూడెం పరిధిలోని ఒడియా క్యాంపు, ఇంతలూరువాగు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి మలేరియా సోకిన రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి లోపల, ఇంటి గోడలపై కొట్టే ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ గురిం చి అవగాహన కల్పించారు. అక్కడి నుంచి నేరుగా మోతుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇన్ పేషెంట్ వార్డును, ఫార్మాసిటీ కార్యాలయాన్ని పరిశీలించారు. ప్రస్తుతం అమలవుతోన్న ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. వైద్యాధికారులు తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్లో జనరేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్యాధికారి నషియా, సిబ్బంది రజిని విజయ పాల్గొన్నారు.

మళ్లీ కరోనా కలకలం

మోతుగూడెం, మే 23(ఆంధ్రజ్యోతి): కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మోతుగూడెం పరిధి తులసిపాక ట్రైబల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆయన మాస్కులను పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరూ కచ్చితంగా మాస్కులను ధరించాలని ఆయన సూచించారు.

గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

జిల్లా అధ్యక్షురాలు శాంతకుమారి



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న శాంతకుమారి

రంపచోడవరం, మే 23(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి అన్నారు.శుక్రవారం ఆమె రంపచోడవరంలో నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు సూచనలు చేశారు. కారం సీతారామన్నదొర మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ ఈక బుల్లికొండలు దొర, స్వప్నకుమారి, కొండ్ల కృష్ణారెడ్డి, కేఎల్ ఎన్ గురుప్రసాద్, మంగరౌతు వీరబాబు, కారు లక్ష్మి, మడకం లక్ష్మీనారాయణ, మడకం ప్రసాద్, సారపు వీరప్రతాప్ దొర, సోడి జంగన్నదొర పాల్గొన్నారు.

పాల్ రాజు వర్ధంతి

ఎటపాక, మే 22(ఆంధ్రజ్యోతి): మేడివాయిలోని పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆ కళాశాల వ్యవస్థాపకుడు డాక్టర్ పాల్‌రాజ్ 15వ వర్ధంతి నిర్వహించారు. కళాశాల ఆవరణలో నిర్మించిన ఆయన విగ్రహానికి కళాశాల కార్యదర్శి వి.రాజశేఖర్, అధ్యాపకులు పూలమాలలతో నివాళులర్పించారు. రాజశేఖర్ మాట్లాడుతూ పాల్‌రాజ్ 1997లో కళాశాలను స్థాపించి, ఎందరో ఇంజనీర్లను సమాజానికి అందించారని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్ర సమయంలో ఎటపాక, భద్రాచలం ఏజెన్సీల్లో ఆయన సేవలు మరువలేనివన్నారు.

ఆదివాసీ పోరాటాలకు రాజకీయాలు అడ్డుకాకూడదు



నిరవధిక దీక్ష చేస్తున్న ఆదివాసీలు

మోతుగూడెం, మే 23(ఆంధ్రజ్యోతి): చింతూరులో ఎంపీపీ నవలం అమల, చట్టి గ్రామానికి చెందిన పీసా కమిటీ కార్యదర్శి పొడియం రామకృష్ణ (రాంబాబు) శుక్రవారం రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. ముందుగా కొమరం భీమ్, బిర్సాముండా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ పోరాటాలకు రాజకీయ పార్టీలు అడ్డు కాకూడదన్నారు. ఇటువంటి పోరాటాల్లో యువత పాల్గొని భవిష్యత్ తరాలకు ఉద్యమస్ఫూర్తిని నింపాలన్నారు. హక్కుల సాధనకు అందరూ ఐక్యతతో ముందుకు రావాలన్నారు. మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ ఆదివాసీ టీచర్స్ పోస్టులు మినహాయించి ఉద్యోగాలను ఆదివాసీ నిరుద్యోగులతో భర్తీ చేయాలన్నారు. ప్రత్యేక డీఎస్సీని విడుదల చేయాలన్నారు. ఎన్నికల ముందు అరకులో ఆదివాసీల సాక్షిగా ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అమల, ఏడుగురాళ్లపల్లి, ఏసీ కోడేరు, ముకునూరు, గంగన్నమెట్ట, తుమ్మల సర్పంచ్‌లు సత్తిబాబు, అగరం సుబ్బలక్ష్మి, బి.సత్యకుమారి, వేక ప్రసాద్, కొవ్వాసి రామారావు, పేగ ఎంపీటీసీ నున్నం నాగరాజు, జేఏసీ చింతూరు మండల కార్యదర్శి కాకా సీతారామయ్య, తుర్రం అశోక్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ నేరాలకు 14405 టోల్‌ఫ్రీ

సమాచారమివ్వండి.. వివరాలు గోప్యం : ఎక్సైజ్ సౌత్ ఇన్‌స్పెక్టర్ సుబ్బిరెడ్డి

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ నేరాలకు సంబంధించి 14405 టోల్‌ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎక్సైజ్ సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుబ్బిరెడ్డి తెలిపారు. ప్రైవేటు మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించే విధంగా చేయడం కోసం ఎక్సైజ్ అధికారులు నైట్ పెట్రోలింగ్ ఏర్పాటు చేశారు. ఆ మేరకు సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు.దీనిలో భాగంగా సౌత్ జోన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందితో రాత్రి గస్తీ ఏర్పాట్లు చేశామని సుబ్బిరెడ్డి తెలిపారు. రాత్రి పెట్రోలింగ్‌లో భాగంగా సమయపాలన, విడి విక్రయాలు, ఎంఆర్పీ కంటే ఎక్కువకు విక్రయించకుండా చూడడం, అనధికార సిట్టింగులను నిరోధించడం, దుకాణాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడడం, సీసీ కెమెరాల పని తీరును పరిశీలించడం వంటి విధులను నిర్వర్తిస్తామన్నారు. నైట్ పెట్రోలింగ్‌ని ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేస్తారని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

రంగంపేట: రంగంపేటలో ఎక్సైజ్ సీఐ సుధ మాట్లాడుతూ మద్యం షాపులు నిబంధనలకు అనుగుణంగా పనిచేసే విధంగా ప్రతిరోజూ రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. ఇందుగాను ప్రతి కానిస్టేబుల్ మూడు లేదా నాలుగు షాపుల బాధ్యతను అప్పగించినట్టు చెప్పారు. సబ్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్పెక్టర్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారన్నారు. మద్యం షాపుల్లో లైసెన్స్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. శుక్రవారం నైట్ పెట్రోలింగ్‌లో ఎక్సైజ్ ఎస్.ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

తొస్సిపూడి డిజిటల్ అసిస్టెంట్‌పై విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో, డీఎంపీడీవో

బిక్కవోలు, మే 23(ఆంధ్రజ్యోతి): తొస్సిపూడి పంచాయతీలోని డిజిటల్ అసిస్టెంట్ మండ సోమిరెడ్డిపై శుక్రవారం ఎంపీడీవో వి.శ్రీనివాస్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమిరెడ్డి పంచాయతీలో ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడని, పలు అవినీతి ఆరోపణలపై కొందరు జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారులకు ఫిర్యాదు చేయగా వారి ఆదేశాలతో విచారణ చేపట్టామన్నారు. పంచాయతీలోని పలు రికార్డులను పరిశీలించి, కొన్ని రికార్డులను సీజ్ చేసి ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్టు ఎంపీడీవో పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొవ్వూరి సీతారత్నం, డిప్యూటీ ఎంపీడీవో జాన్‌మిల్టన్, బలభద్రపురం, తొస్సిపూడి కార్యదర్శులు సంజీవరెడ్డి, శివ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

అభయాంజనేయుడికి పూజలు

చాగల్లు, మే 23 (ఆంధ్రజ్యోతి): చాగల్లులోని అభయాంజనేయస్వామి జయంతి ఉత్సవాలు శుక్రవారమూ వేడుకగా జరిగాయి. స్వామివారికి వేదపండితులతో ఏకాదశ రుద్రాభిషేకం, విశేష రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. సాయంత్రం లక్ష తమలపాకులతో పూజలు చేశారు. అనంతరం కలవలపల్లి సమాజం వారితో భజన కాలక్షేపం జరిగింది.

నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో టీ హబ్!

- తొలిదశలో 3 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రారంభం
- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మరిన్ని సదుపాయాల కల్పన
- జిల్లా కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఉన్న నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో టెక్నాలజీ హబ్(టీ హబ్) ఏర్పాటయ్యే అవకాశం ఉన్నట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ చాంబర్ నుంచి టీ-హబ్ ఏర్పాటు విషయమై సమన్వయ శాఖల అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రధాన కేంద్రంలో టీ హబ్ ఏర్పాటు కోసం నైపుణ్యాభివృద్ధి కేంద్ర భవనంతో పాటు ఒక ప్రైవేటు భవనాన్నా పరిశీలించినట్టు తెలిపారు. టీ హబ్ ఏర్పాటుకు నైపుణ్యాభివృద్ధి కేంద్రం అన్ని విధాల అనుకూలంగా ఉన్నట్టు ప్రాథమికంగా పరిశీలన అనంతరం ఒక అంచనాకు వచ్చినట్టు పేర్కొన్నారు. అయితే మరికొన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సి వుంటుందన్నారు.అందుకు అనుగుణంగా అవసరమైన పనులను అతి త్వరలో ప్రారంభిస్తామని కలెక్టర్ చెప్పారు. దివ్యాంగుల కోసం అవసరమైన ర్యాంపును, లిఫ్టును ఏర్పాటు చేయాలని అధికారులను సూచించారు. టీ హబ్‌ను తొలిదశలో మొదట 3 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. అనంతరం 7 వేల చదరపు అడుగులకు పెంచుతామని, విస్తరణ పనులను 100 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉందని ప్రశాంతి చెప్పారు. పరిశ్రమల భాగస్వామ్యంతో ఏర్పాటయ్యే టీ హబ్ యువతకు ఎంతగానో ఉపయోగకరంగా వుంటుందన్నారు. ఈ హబ్‌లో జేఎన్‌టీయూ కాకినాడ, ఎన్ఐటీ తాడేపల్లిగూడెం, అవంతి, గ్రీన్‌కో సంస్థలు భాగస్వాములుగా ఉన్నట్టు తెలిపారు. బోర్డులో జాయింట్ కలెక్టర్ సభ్యుడిగా ఉంటారన్నారు. హబ్‌కు అవసరమైన భవనాలు, సిబ్బంది మౌలిక వసతులను దశల వారీగా సమకూర్చుతామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీవాణిధర్ రామన్, సహాయకులు ప్రదీప్, మెప్మా ఇన్‌చార్జి పీడీ శ్రీదేవి, నైపుణ్యాభివృద్ధి అధికారి వీజీడీ మురళి, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ప్లాట్ ఫామ్స్ ఆధారిత వర్కర్లు ఈ-శ్రమ్ పొందాలి

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): డెలివరీ బాయ్స్‌గా వివిధ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ఆధారంగా అసంఘటిత రంగంలో పని చేస్తున్న ఉద్యోగులు/వర్కర్లు కార్మిక శాఖ జారీ చేసే గుర్తింపు కార్డులను పొందాలని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. కార్డులు పొందడానికి ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 31 వరకూ ప్రత్యేక నమోదు డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. జొమాటో, స్విగ్గీ, బిగ్ బాస్కెట్, ర్యాపిడో, ఊబర్, ఓలా, బ్లింకిట్ వంటి వాటి ద్వారా ఆహార, సరుకు రవాణా, డెలివరీ రైడ్-షేరింగ్, కొరియర్ సేవలందిస్తున్న వర్కర్లు, డ్రైవర్లు అర్హులన్నారు. ఈ ఉచిత గుర్తింపు కార్డును పొందడం ద్వారా రూ.5 లక్షల పీఎం జన్ ఆరోగ్య యోజన వార్షిక ఆరోగ్య కవరేజీ ఉంటుందని సహాయ కార్మిక కమిషనర్ బీఎస్ఎం వలీ తెలిపారు. మరిన్ని వివరాలకు కార్మిక శాఖను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజానగరం, మే 23(ఆంధ్రజ్యోతి): రాజానగరం సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ సాక్షి ఇండస్ట్రియల్ ఫీడర్‌కు వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల 24న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ జేబీకే నటరాజన్ శుక్రవారం తెలిపారు. దీని ప్రభావంతో పల్లకడియం, రామస్వామిపేట గ్రామాలకు శనివారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

రేపు సంగీత విభావరి

రాజమహేంద్రవరం కల్చరల్, మే 23(ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా రాకా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక విక్రమ్ హాల్‌లో ఈ నెల 25వ తేదీ సాయంత్రం సంగీత విభావరి నిర్వహించనున్నట్టు సంస్థ సెక్రటరీ జీవీ రమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ ఉపన్యాసకుడు అన్నదాత సుబ్రహ్మణ్యేశ్వరరావుకు ఎన్టీఆర్ ప్రతిష్ఠాత్మక పురస్కారం ప్రదానం చేస్తున్నామని, అందరూ విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

వంగలపూడిలో సినీ సందడి



సీతానగరం, మే 23(ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలం, వంగలపూడి గ్రామంలోని ఏటిగట్టు ఆనుకుని ఉన్న పామాయిల్ అరటి తోటల్లో సినీ చిత్రీకరిస్తున్నారు. దీంతో స్థానిక ప్రజల్లో సందడి నెలకొంది. పీఎస్ఆర్ మూవీ మేకర్ బ్యానర్‌పై మొట్టమొదటిగా కొత్తగా ఉంది అనే పేరుతో హీరో హరికృష్ణ నిర్మాతగా సినిమా రూపుదిద్దుకుంటోంది. హీరోయిన్‌గా భవ్య నటిస్తున్నారు. దర్శకుడు ఆది దర్శకత్వంలో హీరో,హీరోయిన్‌ల మధ్య సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు.

యోగాంధ్రను వినియోగించుకోండి

నన్నయ ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మే 23(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయంతో బాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలలు సద్వినియోగం చేసుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం వ్యాయామ విద్య విభాగం ఆధ్వర్యంలో శ్రీరాపర్తి రామ యోగా సంస్థ సహకారంతో యోగాంధ్ర-2025లో భాగంగా ఉచిత ఆన్లైన్ యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనికి హాజరైన వీసీ మాట్లాడుతూ ఈ నెల21 నుంచి వచ్చే నెల21 వరకూ ప్రతిరోజు ఉదయం 7 గంటలనుంచి యోగాంధ్ర కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. యోగ ఫర్ వన్ ఎర్త్-వన్ హెల్త్ అనే నినాదంతో ఈఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములై ఆరోగ్యంగా జీవించాలని చెప్పారు. యోగా సాధనను ప్రతీరోజూ చేయడం ద్వారా ఎన్నో శారీరక, మానసిక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. తరువాత యోగా గురువు ఎస్.శివశంకరరావు దండాసనం, వృక్షాసనం, సర్వాంగాసనం, అమృతాసనం వంటి ఆసనాలు వేయించి యోగాసనాల ప్రాముఖ్యతను తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, వ్యాయామ విద్య అధ్యాపకులు పాల్గొన్నారు.

నెలరోజులు యోగా ఉచిత శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెలరోజులపాటు యోగా ఉచిత శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, రాబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్, హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ శిక్షణా తరగతులు జరుగుతాయని, యోగ ఫర్ వన్ ఎర్త్, ఫర్ హెల్త్ ఇతివృత్తంతో వీటిని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా సుమారు 300 మందికి యోగాలో శిక్షణతో పాటు జిల్లా వ్యాప్తంగా వివిధ రకాలైన పోటీలు నిర్వహించనున్నామని, సైకిల్ ర్యాలీలు, యోగా పాటల పోటీలు వంటివి ఉంటాయని కళాశాల ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

గోదావరి తీరం సుందరీకరణపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి

రాజమహేంద్రి వారసత్వ సంపద పరిరక్షణ సమితి తీర్మానం



సమావేశంలో పాల్గొన్న పరిరక్షణ సమితి సభ్యులు, ప్రముఖులు

రాజమహేంద్రవరం కల్చరల్, మే 23(ఆంధ్రజ్యోతి): గోదావరి తీరంలో సుందరీకరణ, ప్రముఖుల విగ్రహాల తొలగింపు, పునర్నిర్మాణం, విషయంపై కౌన్సిల్ లేనందున అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని రాజమహేంద్రి వారసత్వ సంపద పరిరక్షణ సమితి తీర్మానించింది. శుక్రవారం పరిరక్షణ సమితి సభ్యులు, ప్రముఖుల విగ్రహాల నిర్మాణ కర్తలు సమావేశమై తమ అభిప్రాయాలను తెలియజేశారు. స్థానిక దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీలో కన్వీనర్ దేశిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గోదావరి నదీ తీరాన ప్రముఖుల విగ్రహాలు తొలగించకుండా అభివృద్ధి చేయాలని తీర్మానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అశోక్‌కుమార్ జైన్ మాట్లాడుతూ గోదావరి గట్టును అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందని, ఐతే అభివృద్ధి పేరుతో చేసే సుందరీకరణ వివరాలు వెల్లడించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ విగ్రహాల తొలగింపుపై పునరాలోచించాలన్నారు. కార్యక్రమంలో అల్లు బాబీ, విగ్రహ నిర్మాణ కర్తలు రాయుడు, మాజేటి రవి, దూర్వాసుల సత్యనారాయణ, కె.శ్రీనివాసకుమార్, ఎస్‌బీవీ రెడ్డి,సమితి కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నర్సరీని సందర్శించిన ఎస్పీ శ్రీకృష్ణారావు



ఎస్పీ కృష్ణారావుకు మొక్కను అందజేస్తున్న నర్సరీ రైతులు

కడియం, మే 23(ఆంధ్రజ్యోతి): బుర్రిలంక ఉమాపార్వతి నర్సరీని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ శ్రీకృష్ణారావు సందర్శించారు. నర్సరీ రైతులు కొత్తపల్లి మూర్తి, శివాజీ సృష్టించిన టాల్ బొన్సాయ్ నర్సరీలో 100 సంవత్సరాల వయసున్న వృక్షజాతి మొక్కలను పరిశీలించారు. ఈ మొక్కలను ఎలా సేకరించారు? వాటి వల్ల ఉపయోగాలను అడిగారు. మొక్కల ఉత్పత్తి, మొక్కల పెంపకంలో కడియం నర్సరీ రైతుల కృషి అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో అడబాల స్వామి, బండారు రాము, వెన్నపు అయ్యప్ప, గాద సాయి, మధ్యాహ్నపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

రాజానగరం, మే 23(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుని దర్శనానికి వెళ్తూ మార్గమధ్యలో రాజానగరం వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని, టాటా మేజిక్ వ్యాన్ ఢీకొన్న ఘటనలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో బి.లక్ష్మీదుర్గ (35) శుక్రవారం మృతిచెందింది. ఏలూరు జిల్లా ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన పది మంది బుధవారం ఓ వ్యాన్‌లో అన్నవరం దైవదర్శనానికి బయలుదేరిన విషయం విధితమే. ఏలూరు ఆశ్రమ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో బి.లక్ష్మీదుర్గ పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో మెరుగైన వైద్యంకోసం విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఆస్పత్రి వైద్యులు ధ్రువీకరించినట్టు రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ తెలిపారు.

బ్యాగ్ దొంగ అరెస్ట్

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): రైలు దిగి వెళ్తున్న ఓ మహిళ చేతిలోని బ్యాగ్‌ని లాక్కుని పారిపోయిన దొంగలను టూటౌన్ పోలీసుల అరెస్ట్ చేశారు. ఎస్ఐ టి.శ్యాం తెలిపిన వివరాల ప్రకారం.. ఓ మహిళ(35) ఈ నెల 10న రైల్వే స్టేషనులో రైలు దిగి వెళుతుండగా గూడ్స్ షెడ్ సమీపంలో ఆమె చేతిలో ఉన్న బ్యాగ్‌ని దుండగులు లాక్కొని పారిపోయారు. ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో ఆల్కాట్ గార్డెన్స్‌కి చెందిన బైరెడ్డి మోహన్‌కుమార్, గుడ్ల లక్ష్మీనారాయణలను నిందితులుగా గుర్తించారు. ఇప్పటికే మోహన్‌కుమార్‌ని జైలుకు పంపామని, లక్ష్మీనారాయణను శుక్రవారం అరెస్ట్ చేశామని ఎస్ఐ శ్యాం తెలిపారు.రైలు ఫుట్‌బోర్డులో ప్రయాణించే వారి చేతులపై కర్రలతో గట్టిగా కొట్టి సెల్‌ఫోన్‌లను దొంగిలించిన నేరాల్లో ప్రభుత్వ రైల్వే పోలీసులు(జీఆర్పీ) నమోదు చేసిన కేసులో కూడా వీళ్లే నిందితులని ఆయన పేర్కొన్నారు. ఈ తరహా నేరాలకు పాల్పడే వారిపై పటిష్టమైన నిఘా పెట్టామని, కొందరిని గుర్తించామని వాళ్లని త్వరలోనే అరెస్ట్ చేస్తామని చెప్పారు. కాగా ఇలాంటి తరహా నేరాలపై జీఆర్పీ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది.

బూటకపు ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలి

ఏపీ రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్

గోకవరం, మే23(ఆంధ్రజ్యోతి): చత్తీస్‌గఢ్ అడవుల్లో ఈ నెల 21న మవోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు మరో 28 మందిపై జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ఏపీ రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండు చేశారు. ముందుగా ఎన్‌కౌంటర్‌కు గురైన 28 మం ది అమరులకు సంతాపం తెలిపినట్టు ప్రకటించారు. అటవీ సంపదను, సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు దోచి పెట్టడానికి ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడిచే హిందూ మతోన్మాద కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగారు పేరుతో ఆదివాసీలను బూటకపు ఎన్‌కౌంటర్‌తో హత్యలు చేస్తోందని ఆరోపించారు. శాంతి చర్చలు జరపాలని మావోయిస్టు పార్టీ అనేకమార్లు ప్రకటనలు చేస్తున్నప్పటికీ బీజేపీ ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తూ కనీసం స్పందించకపోవడం, దేశంలో ప్రత్యామ్నాయ శక్తులు లేకుండా చేయడంలో భాగమే ఆపరేషన్ కగారు అని విమర్శించారు. మధ్య భారత అడవుల్లో ఆదివాసులు, మావోయిస్టుల హత్యలకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండు చేశారు. ఆపరేషన్ కగారును వెంటనే నిలిపివేసి మావోయిస్టు పార్టీతో తక్షణం చర్చలు జరిపి, అడవుల్లో ఉన్న బలగాలను వెనక్కి రప్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రమేష్ డిమాండు చేశారు.

జూన్ 7 నుంచి గోగులమ్మ తీర్థ మహోత్సవాలు



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, మే 23(ఆంధ్రజ్యోతి): రాజానగరంలోని రావులచెరువు గట్టునున్న శ్రీ గోగులమ్మ, వీరభద్రస్వామి వార్ల జాతర మహోత్సవాలను జూన్ 7,8 తేదీల్లో నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ శుక్రవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆవిష్కరించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మూడేళ్లకోసారి జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఉదయం జాగరణ, మధ్యాహ్నం ఊరేగింపు జరుగుతుందన్నారు. 8న వీర భద్ర శూలాల సంబరం, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారి తీర్థం జరుగుతుందన్నారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధం



బిక్కవోలులో పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో పూర్ణచంద్రరావు

బిక్కవోలు, మే 23(ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర పథకంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10 వరకూ చదివే విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా వుంచామని ఎంఈవో-2 కె.పూర్ణచంద్రరావు శుక్రవారం తెలిపారు. మండలంలో 30 ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలు వున్నాయన్నారు. ఈ పాఠశాలలకు 17,435 పాఠ్య పుస్తకాలు సరఫరా చేయవల్సి వుండగా మొత్తం పుస్తకాలు సిద్ధంగా వుంచామన్నారు. అయితే 3271 కిట్లు రావల్సి వుందన్నారు. ఇందులోని బెల్ట్‌లు, డిక్షనరీలు వచ్చాయని, ఇంకనూ స్కూల్ బ్యాగ్, యూనిఫారమ్ క్లాత్, షూ, సాక్సులు రావల్సివుందని అవి త్వరలోనే వస్తాయని, వచ్చిన వెంటనే అన్ని పాఠశాలలకు పంపిణీ చేస్తామని ఏంఈవో వివరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నిడదవోలు, మే 23 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలోని మంత్రి కందుల దుర్గేష్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జనసేన పార్టీ నాయకులు నియోజకవర్గంలోని 34 మంది బాధితులకు రూ.16.20 లక్షల సీఎం ఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సంద ర్భంగా జనసేన పార్టీ నాయకులు మాట్లాడుతూ మంత్రి దుర్గేష్ ఆదేశాలతో బాధితులను ఆదుకునేందుకు సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కులను అందించడం జరిగిందన్నారు.

22 మందికి.. రూ.2.20 లక్షల జరిమానా

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వారికి వేసిన జరిమానాతో మత్తు వీడిపోయింది. డ్రంకెన్ డ్రైవ్(మద్యం తాగి వాహనం నడపడం) కేసుల్లో 22 మంది పట్టుబడ్డారు. ఈ మేరకు వారిని 3వ ఏజేఎఫ్‌సీ మేజిస్ట్రేట్ సి.రమ్య ఎదుట శుక్రవారం హాజరుపర్చారు.ఈ మేరకు ఆమె ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున 22 మందికి రూ. 2.20 లక్షల జరిమానా విధించారని ట్రాఫిక్ ఇన్‌చార్జి డీఎస్పీ కె.రమేశ్‌బాబు తెలిపారు.

ప్రతి మహిళ ఫోన్‌లో శక్తి యాప్ ఉండాలి : ఎస్పీ

రాజమహేంద్రవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి బాలిక, మహిళ సెల్‌ఫోన్‌లో శక్తి యాప్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశించారు. శక్తి యాప్, మహిళల రక్షణపై శక్తి టీమ్‌తో శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. మహిళల రక్షణకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు తదితర చోట్ల శక్తి టీమ్‌లు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. మహిళల రక్షణకే శక్తియాప్ రూపొందించామని తెలిపారు. ఇబ్బందికర పరిస్థితుల్లో ఆ యాప్‌పై టచ్ చేస్తే క్షణాల్లో పోలీసులు వస్తారన్నారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, ఎల్.అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



హాస్టళ్ల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

డ్రాపవుట్స్‌ను గుర్తించండి

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : స్కూళ్లు తెరిచేనాటికి హాస్టళ్లలో పనులన్నీ పూర్తిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం జిల్లా సాంఘిక సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ హాస్టళ్లలోను, అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై పీవీజీటీ గ్రూపులకు గృహ నిర్మాణ పనులు చేపట్టడంపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. బడి బయట పిల్లలను గుర్తించి, డ్రాపవుట్స్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తిరిగి స్కూళ్లకు రప్పించి వారికి వసతిగృహాల్లో సీట్లు కేటాయించాలన్నారు.ఈ మేరకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. విడాకులు తీసుకున్న, విదేశాలకు వెళ్లిన మహిళల పిల్లలను, అనురక్షిత వాతావరణంలో ఉన్న ఆడపిల్లలను గుర్తించి హాస్టళ్లలో చేర్చాలన్నారు. అన్ని వసతిగృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో పీవీటీజీలుగా ఉన్న చెంచు కమ్యూనిటీకి చెందిన 399 మంది జనాభా ఉన్నారని, వీరందరికీ ఆధార్, రేషన్‌కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆరోగ్యశ్రీ కార్డులు, ఆయుష్మాన్ కార్డులు ఉన్నాయా లేవా అనేది డేటా సేకరణ చేపట్టడం కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి ఎంఎస్ శోభారాణి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి కేఎన్ జ్యోతి, బీసీ సంక్షేమ అధికారిణి బి.శశాంక, ముఖ్య ప్రణాళికాధికారి జేడీ ఎల్.అప్పలకొండ, కె.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారుల సమావేశంలో జేసీ,డీఆర్వో

తహశీల్దార్ల పనితీరుపై జేసీ అసంతృప్తి

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కొందరు తహశీల్దార్ల పనితీరు పట్ల జేసీ ఎస్.చిన్నరాముడు అసంతృప్తి వ్యక్తం చేశారు.కలెక్టరేట్‌లో శుక్రవారం రెవెన్యూ అధికారుల సమావేశంలో మాట్లాడారు. మండలాల పరిధిలో లబ్ధిదార్లకు కేటాయించిన స్థలాల్లో ఎందుకు ఇంటి నిర్మాణాలు చేపట్టలేకపోతున్నారనే కారణాలను తహశీల్దార్లు తెలుసుకోవాలన్నారు. ఎవరూ క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు.క్షేత్ర స్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు పాటించకపోతే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు.సమావేశంలో డీఆర్వో సీతారామమూర్తి,సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మినీ మహానాడు వేదికపై సుజయకృష్ణ రంగారావు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, మద్దిపాటి వెంకటరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు,నాయకులు బూరుగుపల్లి శేషారావు, రుడా చైర్మన్ బీవీఆర్ తదితరులు

మహా.. సంబరం

- ఘనంగా మినీ మహానాడు
- వెల్లువెత్తిన నాయకులు
- పలు తీర్మానాలు ఆమోదం

రాజమహేంద్రవరం అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : జెండా మోసిన ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని.. సరైన సమయంలో వారి కష్టానికి తగిన గుర్తింపు దొరుకుతుందని తెలుగుదేశం పార్టీ జోన్ - 2 కో ఆర్డినేటర్ సుజయ కృష్ణ రంగారావు అన్నారు. రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని చెరుకూరి కన్వెన్షన్ హాలులో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి మహానాడులో ఆయన మాట్లాడారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి యర్రా వేణుగోపాల రాయుడు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, మునిసిపల్ మాజీ ఛైర్మన్ సూరపనేని చిన్ని తదితరులు మాట్లాడారు. కార్యకర్తలందరి కష్టం వల్లే వైసీపీ రాక్షసపాలన నుంచి ప్రజలకు విముక్తి లభించింది. మాకందరికీ గుర్తింపు, గౌరవం దక్కింది. రాష్ట్ర పునర్నిర్మాణం, పురోభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లకు మనమందరం అండగా నిలవాలి అని పలువురు మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, సీనియర్ నాయకులు పేర్కొన్నారు. మహానాడుకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, రాష్ట్ర మహిళా కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి తురకల నిర్మల , టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాస రావు, ఎండీ అస్లాం, రాజమండ్రి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జులు పలు తీర్మానాలు ప్రవేశపెట్టగా వాటన్నింటినీ ఆమోదించారు.



ప్రాంగణంలో పసుపు తోరణం



ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చిత్రంలో సుజయకృష్ణ రంగారావు



నాయకులు, కార్యకర్తలతో కిక్కిరిసిన తూర్పుగోదావరి జిల్లా మినీ మహానాడు ప్రాంగణం

జగన్ జైలు కెళతాడు..



నేడో, రేపో మద్యం స్కాంలో వైసీపీ అధినేత జైలుకెళ్లడం ఖాయం.. రెడ్‌బుక్ అమలుకావడంలేదని కొంతమంది అనుకుంటున్నారు.రెడ్‌బుక్ తనపని తాను చేసుకుపోతోంది. జగన్మోహన్‌రెడ్డి ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నాడు. జిల్లా మహానాడు పద్ధతిగా జరగడం లేదు..ప్రొటోకాల్ పాటించడంలేదు.ఇదీ నా అభిప్రాయం.

- గన్ని కృష్ణ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మద్దతుగా నిలవాలి..



చంద్రబాబు, లోకేశ్‌కు అందరం మద్దతుగా నిలవాలి. వారి సహాయంతో రాష్ట్రంలోను, నియోజకవర్గాల్లోనూ అభివృద్ధి, సంక్షేమం అందిపుచ్చుకోవాలి.రాజమహేంద్రవరం సిటీకి గోదావరి రివర్‌ఫ్రంట్ ఒక మణిహారంగా మారుతుంది. సిటీ ఎమ్మెల్యేగా ఉన్న తన కుమారుడు దీన్ని సాధించడం ఆనందంగా ఉంది.

- ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎమ్మెల్సీ

రోడ్డుకు సీఎం చొరవ



కాకినాడ కెనాల్‌రోడ్డు శాశ్వత నిర్మాణ పనులు ప్రారంభం కావడం చాలా ఆనందంగా ఉంది. ఇప్పటికే రూ.7 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశారు. సీఎం చంద్రబాబు చొరవతో ఇది సాధ్యమైంది. ధన్యవాదాలు తెలుపుతున్నా. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు ఎన్ టీఆర్ పేరు పెట్టాలన్నారు.

- మనోజ్‌రెడ్డి, అనపర్తి ఇన్‌చార్జి

పసుపు సైనికులకు పాదాభివందనం



నియంతపాలనకు చరమగీతం పాడిన పసుపుసైనికులకు పాదాభివందనం. అక్రమకేసులు పెట్టి చంద్రబాబును 53 రోజులు జైలులో పెట్టారు. తనను, తన తండ్రి ఆదిరెడ్డి అప్పారావును అన్యాయంగా జైలులో ఉంచారు. అన్నింటినీ ఎదుర్కొని ధైర్యంగా నిలదొక్కుకున్నాం.

- ఆదిరెడ్డి శ్రీనివాస్, సిటీ ఎమ్మెల్యే

ఎన్‌టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి



తెలుగువారి ఆత్మగౌరవం, విశ్వాసానికి ప్రతీక టీడీపీ.తెలుగు ప్రజల అభివృద్ధిలో పార్టీకి విడదీయరాని అనుబంధం ఉంది. తెలుగువాడి ఆత్మగౌరవాన్ని దేశ విదేశాల్లో చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి. అక్రమ కేసులు ఎత్తివేయాలి.

- ఎం.వెంకటరాజు, గోపాలపురం ఎమ్మెల్యే

జగన్ పాలనంతా అవినీతిమయం



జగన్మోహనరెడ్డి పాలన అంతా అవినీతిమయం.ఐఏఎస్, ఐపీఎస్‌లను జైలుకు వెళ్లేలా చేసిన ఘనుడు.చంద్రబాబు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి. కొవ్వూరులో100 పడకల ఆసుపత్రి నిర్మించాలి.

- ఎం.వెంకటేశ్వరరావు, కొవ్వూరు ఎమ్మెల్యే

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు తపన



చంద్రబాబు 70 ఏళ్ల వయసులో రాష్ట్రాభివృద్ధికి అలుపెరగని శ్రమ చేస్తున్నారు. లోకేశ్ తాత, తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ పార్టీని పటిష్టపరచడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.వైసీపీలో నాశమైన వ్యవస్థలన్నింటినీ గాడిన పెట్టే ప్రయత్నం జరుగుతోంది. **-శేషారావు, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్**

పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దాలి..



ఆతిథ్యానికి మారుపేరుగా నిలిచే గోదావరి జిల్లాల్లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసుకోవాల్సి ఉంది..రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్‌గా చేయాలి. అలాగే పార్టీకి ఇప్పటి వరకూ జిల్లా ఆఫీస్ లేదు. తక్షణమే జిల్లా ఆఫీసు ఏర్పాటు చేసుకోవాలి. **- బొడ్డు వెంకట రమణ చౌదరి, రుడా చైర్మన్**

నేతి మిఠాయిలు.. నేతి పచ్చళ్లు.. నేతితో చేసిన పూతరేకులు.. నెయ్యి పేరు చెబితే చాలామంది ఫిదా అయిపోతారు.. ఎంత ధర అయినా పట్టించుకోరు.. కొనేస్తారు.. తినేస్తారు.. వ్యాపారులు తమ వ్యాపార విస్తరణకు ఇదే ట్రిక్ అమలు చేస్తున్నారు.. చాలాచోట్ల సక్సెస్ సాధిస్తున్నారు.. అయితే కొనుగోలుదారుడు మాత్రం ఆ వ్యాపారికి అంత నెయ్యి ఎక్కడి నుంచి వచ్చిందనేది కనీసం ఆలోచించకుండా కొనేస్తున్నాడు.. తినేస్తున్నాడు.. అనారోగ్యం పాలవుతున్నాడు.. ఆత్రేయపురం పూతరేకులు అంటే అంతా ఇంతా డిమాండ్ కాదు.. గురువారం అక్కడ 80 కిలోల కల్తీ నెయ్యి పట్టుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది..





గీ..మోసం!

మార్కెట్ అంతటా కల్తీ నెయ్యి

- విచ్చలవిడిగా అమ్మకాలు
- పాడి తక్కువ..ఉత్పత్తి ఎక్కువ
- వినియోగంపై కుదరని పొంతన
- నూనె,డాల్డాతో నెయ్యి తయారీ
- పూతరేకులు, స్వీట్స్‌లో వాడకం
- దేవుడి దీపారాధనదీ ఇదే తీరు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఇంకాస్త వెయ్.. అంటూ నెయ్యిని జుర్రుతున్నారా!.. ఆవకాయ పచ్చడిలో నెయ్యి ఉంటేనే గానీ ముద్ద దిగడం లేదా!.. నేతి మిఠాయిలను చూస్తే నోరూరిపోతోందా!.. ఇడ్లీ నానిపోయేలా నేతిని పోస్తున్నారా!.. అయితే ఈ కథనం మీ కోసమే. నేతి బీర పేరులో అయినా నెయ్యి ఉందేమోగానీ.. మనం వాడే నెయ్యిలో మాత్రం నెయ్యి 'నై'గానే ఉందని అధికారులు చేస్తున్న పరీక్షలు నిర్ధారిస్తున్నాయి. రంగు, వాసన, రుచి ఓకే.. కానీ అది నెయ్యేనా? అంటే సమాధానం ఠక్కున నీరుగారిపోవాల్సి వస్తోంది. ఇంట్లో ఓపిగ్గా తయారు చేసుకున్న నెయ్యిని జుర్రుకుంటే పర్వాలేదు. మార్కెట్‌ని ముంచెత్తుతున్న నెయ్యిని జాగ్రత్తగా గమనించి వాడకపోతే మాత్రం ఆరోగ్యం మన చేతుల్లోంచి జారుకున్నట్టే.

ఇదీ ఒక గృహిణి లెక్క..

నెయ్యి తయారీకి ప్రధాన ముడి సరుకు వెన్న. అది పాల నుంచే వస్తుంది. ఒక అరకిలో నెయ్యి తయారు కావాలంటే సాధారణ గృహిణి లెక్కల్లో చూసినా.. గేదె పాలు రోజుకు లీటరు చొప్పున చూసుకుంటే దానికి వచ్చే వెన్న సుమారు ఓ కోడిగుడ్డు పరిమాణం ఉంటుంది. అలా నెల రోజులైన తర్వాత మరిగిస్తే ఓ అరకిలో నెయ్యి తయారవుతుంది. కానీ రోజు రోజుకూ పాడి తగ్గుతున్నా నెయ్యి మాత్రం విరివిగా లభ్యమవుతూ కిలో రూ.250కే దొరికేస్తోంది. ఇది ఎలా సాధ్యమో అధికారుల విచక్షణతో ఆలోచించాలి..

కల్తీ నెయ్యి తయారీ ఇలా..

నెయ్యిని రకరకాల పద్ధతుల్లో కల్తీ చేస్తున్నారు. రసాయనాలతో తయారుచేస్తున్నారు. రాజమహేంద్రవరం రూరల్ కోలమూరులో 9 నెలల కిందట నెయ్యి తయారీ కేంద్రంలో సోదాలు చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు నివ్వెరపోయారు. వంట నూనెను వేడి చేసి డాల్డాను జోడించి నెయ్యి మాదిరిగా వాసన, రంగు కోసం కృత్రిమ రసాయనాలు కలుపుతున్నారని బయట పడింది. ఆవు నెయ్యి కాస్త తెల్లగా, గేదె నెయ్యి లేత గోధుమ రంగులో ఉంటుంది. ఆ రంగులు రావడం కోసం సింథటిక్ కలర్స్ కలుపుతున్నారు. ఇలాంటి నెయ్యిని వాడితే ఆరోగ్యానికి హానికరమని వైద్యులు చెబుతున్నారు. స్వచ్ఛమైన ఆవు నెయ్యితో దీపాలు వెలిగిస్తే ఆరోగ్యం. కల్తీ నెయ్యితో దీపాలు వెలిగిస్తే వచ్చే పొగను పీల్చడం వల్ల వివిధ క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వినియోగమెంత..వచ్చేదెంత!

నెయ్యికి ముడి సరుకు అయిన పాల లెక్క చూస్తే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 2 లక్షల ఆవులు, 6 లక్షల గేదెలు ఉంటాయి. వాటిలో 60 శాతం పాలిచ్చేవిగా భావించవచ్చు. ఒక గేదె ఒక రోజుకు 6 లీటర్ల పాలు ఇస్తోందని అనుకున్నా..అంతటికీ వెన్న తీయరు. గేదె పాలు స్వచ్ఛంగా ఉంటే 9%, ఆవు పాలల్లో సుమారు 4% వరకూ ఫ్యాట్ ఉంటుంది. సుమారు 2 లక్షల గేదె పాలు, 50 వేల ఆవు పాల నుంచి వెన్న సేకరించినా దాదాపు 10 టన్నుల వెన్న వస్తుంది. దాని నుంచి 20% నెయ్యి ఉత్పత్తి అనుకున్నా 2 టన్నుల నెయ్యి మాత్రమే ఉమ్మడి జిల్లాలో ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. బయటి నుంచి వెన్న కొన్నా మరో 2 టన్నులకు మించి తయారుకాదు. కానీ డబ్బాలు డబ్బాల్లో టన్నుల కొద్దీ నెయ్యి విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో రోజుకు నెయ్యి వాడకం ఎంత ఉంటుందనే విషయం లెక్కకు చిక్కదు. ముహూర్తాల సీజన్, కార్తీక మాసం వంటి నెలల్లో నెయ్యి వాడకం ఎక్కువగా ఉంటుంది.

ఉలిక్కిపడిన.. 'ఆత్రేయపురం'

పూతరేకులకు ఆత్రేయపురం పేరుగాంచింది. బెల్లం, పంచదార పొడితో పాటు నెయ్యి వేస్తేనే పూతరేకులకు రుచి వస్తుంది. దీంతో అధిక శాతం తయారీదారులు కల్తీ నెయ్యిని వినియోగిస్తున్నారు. ఆత్రేయపురంలో గురువారం 80 కిలోల కల్తీ నెయ్యిని పక్కా సమాచారంతో రెవెన్యూ, ఫుడ్ సేఫ్టీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెయ్యిని ఆ వ్యాపారి ఎప్పటి నుంచో కిలో రూ.250కి పూతరేకుల తయారీదారులకు విక్రయిస్తున్నాడు. ఆ సొమ్ముకు స్వచ్ఛమైన గేదె నెయ్యి 100 ఎంఎల్ కూడా రాదు. ఒక్క ఆత్రేయపురంలోనే కాదు.. ఎక్కడ చూసినా నెయ్యిలో నాణ్యత మాత్రం కొరతగానే ఉంది.

తనిఖీ చేయాలని ఆదేశాలిచ్చాం..


నెయ్యి, నూనెల విషయంలో తనిఖీలు ముమ్మరం చేస్తున్నాం. అనుమానిత ప్రాంతాల్లో తరచుగా తనిఖీలు చేయాలని ఇప్పటికే ఆదేశాలిచ్చాం. అనుమతులు పొందకుండా ఎక్కడైనా వాణిజ్య పరంగా తయారు చేస్తున్నారా? అనే విషయంపై నిఘా పెట్టాం. కల్తీ పదార్థాలపై సమాచారం ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

- శ్రీనివాస్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, ఉమ్మడి తూర్పుగోదావరి

ఉమ్మడి జిల్లాలో 23 కంపెనీలు..

అధికారిక లెక్కల ప్రకారం.. కాకినాడ జిల్లాలో నెయ్యి తయారీకి 7, రీప్యాక్ 3, తూర్పుగోదావరిలో నెయ్యి తయారీకి 15, రీప్యాక్ 1, కోనసీమ జిల్లాలో తయారీకి 1, రీప్యాక్‌కి 2 కంపెనీలకు అనుమతులు ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 23 కంపెనీలు నెయ్యి తయారు చేస్తున్నాయంతే. అనుమతులు పొందకుండా వాణిజ్యపరంగా తయారు చేసే చిరు వ్యాపారులు 500 వరకూ ఉంటారని ఓ అంచనా. గతేడాది కాలంగా ఆహార భద్రత అధికారులు కాకినాడ జిల్లాలో 14 నమూనాలు సేకరించగా 3 నాణ్యత తక్కువగా ఉన్నట్టు.. ఒకటి అసలు వాడడానికి పనిచేయదని రిపోర్టులు వచ్చాయి. కోనసీమలో 2, తూర్పుగోదావరిలో ఐదులో 2 హానికరమైనవని తేల్చారు. అయినా చర్యల్లేవ్.. చట్టంలో ఉన్న లొసుగులు వ్యాపారులకు వరంగా మారాయి. ఫుడ్ సేఫ్టీ అధికారులు సరిపడా లేకపోవడం అనుకూలతగా మారింది. ఉమ్మడి తూర్పులో ఒక పర్యవేక్షణాధికారితో కలిపి కేవలం ఆరుగురు మాత్రమే ఫుడ్ సేఫ్టీ శాఖకు అధికారులు ఉన్నారు.వీరికి వాహనం ఉండదు. తూర్పుగోదావరి జిల్లాలో ఒకే ఒక్క అధికారి ఉన్నారు. దీంతో మూడు పువ్వులు.. ఆరు కాయలుగా కల్తీ వ్యాపారం సాగిపోతోంది.

పన్ను పోటు తగ్గింది!





చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

- దిగిరానున్న హరిత పన్ను
- హామీ నెరవేర్చిన చంద్రబాబు
- జిల్లాలో లక్షలాది వాహనాలు
- 9 లక్షల మందిపై పన్నుపోటు
- 24.30 కోట్ల వరకు ఊరట
- గత వైసీపీలో బాదుడే బాదుడు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ప్రజలను ఎడాపెడా పన్నులతో బాదేయడమే పనిగా పెట్టుకున్న గత వైసీపీ ప్రభుత్వం ఏటా వాహనదారుల నుంచి కోట్లలో పిండేసింది. హరితపన్ను పేరుతో రోడ్డెక్కిన ప్రతి వాహనం నుంచి డబ్బులు గుంజేసింది. జేబులు గుల్లచేసేసింది. ఎట్టకేలకు ఈ హరితపన్ను దోపిడీ నుంచి వాహనదారులకు ఉపశమనం లభించింది. గత జగన్ పాలనలో వాహనాలపై రూ.20 వేల వరకు విధించిన హరితపన్ను రాష్ట్ర ప్రభుత్వం భారీగా తగ్గిస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది. ఇకపై ఆయా వాహనాల కేటగిరీ ఆధారంగా రూ.1,500 నుంచి రూ.3 వేల వరకు మాత్రమే వసూలు చేయడానికి అంగీకరించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాదాపు 9 లక్షల మంది వాహనదారులకు పన్ను బాదుడు తప్పనుంది. అత్యధికంగా ఉమ్మడి జిల్లాలో 55 వేల వరకు ఉన్న లారీలకు భారీగా మేలు చేకూరబోతోంది.

రూ.200 నుంచి రూ.20 వేలకు..

గత టీడీపీ ప్రభుత్వంలో వాహనం రిజిస్ట్రేషన్ జరిగిన తేదీ నుంచి ఏడేళ్లు దాటితే రూ.200 వరకు మాత్రమే కట్టించుకునేవారు. అయితే కాలం చెల్లిన వాహనాలు తగ్గించే ఉద్దేశంతో కేంద్రం హరిత పన్నులు పెంచుకునేలా రాష్ట్రాలకు అవకాశం ఇచ్చింది. ఇదే అదనుగా గత వైసీపీ ప్రభుత్వం అన్ని రకాల వాహనాలపై 2022 జనవరి 1 నుంచి హరిత పన్నును భారీగా పెంచేసింది. అప్పటి వరకు ఉన్న రూ.200 పన్నును వివిధ శ్లాబ్‌లుగా విడదీసి లారీలు, టిప్పర్ల నుంచి రూ.20 వేల వరకు పిండేసింది. ప్యాసింజర్ వాహనాలు, స్కూలు, కాలేజీ బస్సులు, మ్యాక్సీ క్యాబ్స్ ఓమ్నీ బస్సులు వంటి వాటికి రూ.6 వేలు, చివరకు ఆటోలు, బైక్‌లు, క్రేన్‌లు, ట్రాక్టర్లపైనా భారీగా పన్ను పెంచేశారు. పెరిగిన పన్ను భారం భరించలేక వీరంతా ఆందోళనలు చేశారు. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో 55 వేల వరకు లారీలు ఉండగా వీటిపై కోట్లలో పన్ను భారం పడింది. కాకినాడ జిల్లా వరకు చూస్తే 2.94 లక్షల వాహనదారుల నుంచి జగన్ ప్రభుత్వం హరితపన్ను పిండేసింది. తూర్పుగోదావరి జిల్లాలో 2.10 లక్షలు, కోనసీమ జిల్లాలో 1.80 లక్షల వాహనాలపై కలిపి కోట్లలో పన్నులను జగన్ ప్రభుత్వం పిండేసింది. ఏడేళ్లు, పదిహేనేళ్లు దాటిన కేటగిరీ పేరుతో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి పన్నులు వసూలు చేశారు.

నాడు హామీ ఇచ్చి.. నేడు..

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రచారాలకు వెళ్లిన సమయంలో హరితపన్ను దోపిడీ నుంచి బయటపడేయాలని లారీ యజమానులు కోరారు. ప్రభుత్వం మారగానే పన్ను బెడద తగ్గిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ మేరకు రవాణా, రవాణాయేతర వాహనాలపై హరిత పన్నును తగ్గిస్తూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. కేబినెట్ సైతం పన్ను తగ్గింపుపై తీర్మానం చేసింది. ప్రస్తుతం ఉన్న హరితపన్నును భారీగా తగ్గిస్తూ ఆయా వాహనాల కేటగిరీ, వయస్సు ఆధారంగా రూ.1,500 నుంచి రూ.3 వేల వరకు మాత్రమే వసూలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఒకరకంగా చెప్పాలంటే రూ.24.10 కోట్ల వరకు ఉమ్మడిజిల్లా వాహనాలపై పన్ను భారం దిగనుంది. అత్యధికంగా కాకినాడ జిల్లాలో 2.94 లక్షల వాహనాలపై రూ.9 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 2.10 లక్షలు వాహ నాలపై రూ.8.10 కోట్లు, కోనసీమలో 1.80 లక్షల వాహనాలపై రూ.7 కోట్ల వరకు పన్ను భారం తగ్గుతున్నట్టు అధికారులు అంచనా.

కొవ్వాడ కాల్వ పూడికతీత పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

దేవరపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): కొవ్వాడ కాల్వ వల్ల వేలాది ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని, పూడిక తీతతో దాన్ని నివారించవచ్చని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు. గౌరీపట్నంలో రూ. 80 లక్షల వ్యయంతో చేపట్టే పనులను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యద్ధనపూడి బ్రహ్మారాజు, మండల టీడీపీ అధ్యక్షుడు అంగ్రూ అనిల్, టీడీపీ నేతలు కొయ్యలమూడి చినబాబు, గన్నమని హరికృష్ణ, కొయ్యలమూడి సుధారాణి, షేక్ మీరాసాహేబ్, ముప్పన సుధీర్, ఇరిగేషన్‌శాఖ డీఈ సుజాత, ఏఈ రాహుల్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

'కర్మ యోగ విశిష్టతను తెలుసుకోవాలి'


పట్టణంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న హిందూ జ్ఞాన వేదిక సభ్యులు

కొవ్వూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతిఒక్కరూ కర్మ యోగ విశిష్టతను తెలుసుకోవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక రాజమహేంద్రవరం కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఔరంగాబాద్, మండలంలోని తోగుమ్మి, వాడపల్లి, పశివేదలలో త్రైతసిద్ధాంత భగవద్గీత గ్రంథం ప్రచారాన్ని నిర్వహించారు. శేఖర్‌బాబు మాట్లాడుతూ భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానాన్ని తెలియజేస్తుందన్నారు. మానవ శరీరంలో భగవంతుడు మూడు ఆత్మలుగా విభజింపబడి ఉన్నాడన్నారు. ఆత్మ, జీవాత్మ, పరమాత్మ గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో హిందూ జ్ఞానవేదిక సభ్యులు సోమినాయుడు, వ్యాస్, భరత్, సత్యవతి, సంధ్యారాణి, సరిత, వరలక్ష్మి, సూర్యకుమార్, చిన్నారి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూ నాయకుల హర్షం



ఆర్టీసీ డిపో ఎదుట ఆనందోత్సవాల్లో ఎన్‌ఎంయూ నాయకులు

కొవ్వూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు మేలు కలిగించే 2019 సర్క్యులర్‌ని యథావిధిగా అమలు చేయాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంపై ఎన్‌ఎంయూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శి మాకినీడు శివకుమార్ ఆధ్వర్యంలో ఆనందోత్సవాలను నిర్వహించారు. శివకుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం 2019 సర్క్యులర్‌ని నిర్వీర్యం చేసి, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ 87 రోజుల పోరాటాల ఫలితంగా కూటమి ప్రభుత్వం 2019 సర్క్యులర్‌ను అమలుచేయాలని ఆదేశాలు జారీ చేయడం సంతోషదాయకమన్నారు. దీనిలో భాగంగా అధికారులకు, యాజమాన్యానికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పలువురు మాట్లాడారు.కార్యక్రమంలో గ్యారేజ్ అధ్యక్షుడు పి.కృష్ణమోహన్, సెక్రటరీ సిహెచ్ శివ, పి.సోమరాజు, ఎంఎస్‌రావు, కె. శ్రీనుబాబు, వీఆర్ శేఖర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్‌శాఖ నైట్ పెట్రోలింగ్

నిడదవోలు, మే 23 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు నిబంధనలకు అనుగుణంగా పనిచేసేవిధంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ శాఖ ఆధ్వర్యంలో నైట్ పెట్రోలింగ్‌ను ఏర్పాటు చేసినట్టు ఎక్సైజ్ సీఐ ఆర్.సతీష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఆయన నిడదవోలులో మాట్లాడారు.

ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

- జిల్లా మహానాడు ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే ముప్పిడి


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, తదితరులు

కొవ్వూరు, మే 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. రాజమహేంద్రవరం చెరుకూరి కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన జిల్లా మహానాడుకు నియోజకవర్గం నుంచి బయలుదేరిన టీడీపీ నాయకుల ర్యాలీని ఎమ్మెల్యే స్థానిక పార్టీ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా మహానాడులో నియోజకవర్గానికి సంబంధించిన తీర్మానాలను కొవ్వూరు మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని ప్రవేశపెట్టారు. ఇందులో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయాలని, కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో కొవిడ్ ముందు ఆగే అన్ని రైళ్లకు తిరిగి హాల్టింగ్ కల్పించాలని, కొవ్వూరు టౌన్‌లోకి అన్ని డిపోల ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, చాగల్లు ఆసుపత్రిని 30 పడకలుగా విస్తరించాలని, తదితర తీర్మానాలను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, పట్టణ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సర్పంచ్‌లు పాలడుగుల లక్ష్మణరావు, మేకలశ్రీను, క్లస్టర్ ఇన్‌చార్జిలు రాజాన శ్రీనివాస్, మరపట్ల కళాధర్, నాయకులు మద్దిపాటి సత్యనారాయణ, గారపాటి రామకృష్ణ, బర్ల శ్రీనివాస్, పెండ్యాలశ్రీనివాస్, వరిగేటి కాంతరాజు, బొండాడ సత్యనారాయణ, బొబ్బిలి పేర్రాజు, నియోజకవర్గంలోని మూడుమండలాలకు చెందిన నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మహానాడుకు తరలిన తెలుగు తమ్ముళ్లు


రాజమండ్రి టీడీపీ మహానాడుకు వెళుతున్న శేషారావు, తదితరులు

నిడదవోలు, మే 23 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలోని చెరుకూరి గార్డెన్స్‌లో శుక్రవారం జరిగిన టీడీపీ జిల్లా మహానాడుకు నిడదవోలు పట్టణం, మండలం నుంచి మాజీ ఎమ్మెల్యే, స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. వెళ్లినవారిలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు వెలగన సూర్యారావు, తిరుపతి సత్యనారాయణ, పంచదార వెంకట దుర్గాప్రసాద్, బుగ్గే శివరామకృష్ణ శాస్త్రి, తదితరులు ఉన్నారు.

పంపిణీకి పాఠ్య పుస్తకాలు సిద్ధం

బిక్కవోలు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదోతరగతి చదివే విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా వుంచామని ఎంఈఓ-2 కె. పూర్ణచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గోపాలపురం రూపురేఖలు మారుస్తా : ఎమ్మెల్యే


గోపాలపురంలో నిర్వహించిన గ్రామదర్శినిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం మండలం అభివృద్ధికి దూరంగా ఉందని, రానున్న రోజుల్లో రూపురేఖలు మారుస్తానని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. శుక్రవారం జగన్నాథపురం, కోమటిగుంట, కరిచర్లగూడెం, సంజీవపురం, గుడ్డిగూడెం, కొవ్వూరుపాడు, వాదాలకుంట, గోపాలపురంలో గ్రామదర్శిని కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా నియోజకవర్గ ముఖ్య కేంద్రంగా పేరొందిన గోపాలపురం ... అభివృద్ధికి నోచుకోకపోవడం బాధాకరమన్నారు. నియోజకవర్గం ఏర్పడిన తరువాత గెలిచిన ప్రతి ఎమ్మెల్యే 10 శాతం అభివృద్ధి చేసినా ... రూపురేఖలు మారేవన్నారు. అయితే ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం కడు దయనీయంగా మారిందన్నారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపే పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు రూ. మూడుకోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబు ఆకాంక్షను నెరవేర్చటం కోసం నూరుశాతం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ప్రజల ఓట్లతో గెలిచాక ప్రజలకు కనిపించని ఎమ్మెల్యేలు ఎందరో ఉన్నారని, వారికి భిన్నంగా అభివృద్ధి శ్రీకారం చుట్టామన్నారు. అనంతరం వెదుళ్లకుంటకి చెందిన జొన్నలగడ్డ రామకృష్ణకు సీఎం సహాయనిధి చెక్కుఅందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి, మండల ప్రధాన కార్యదర్శి వడ్లమూడి రమేశ్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ముమ్మిడి సత్యనారాయణ, సీనియర్ నాయకులు నున్నా వెంకటమోహనరావు, కొర్లపాటి రాము, తెలుగు యువత అధ్యక్షుడు కాట్రగడ్డ సురేశ్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు నాగరాజు, జ్యేష్ట శ్రీధర్, జ్యేష్ట శ్రీనివాసరావు, యండ్రప్రగడ మంగారావు, కూనపం ప్రసాద్ బాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం

దేవరపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇందులో కృష్ణంపాలెంకి చెందిన జక్కంశెట్టి సత్యవతి ఐదులీటర్లు, సంగాయిగూడెంకి చెందిన మల్లిపూడి కాంతమ్మ వద్ద ఐదు లీటర్లు సారా .... మొత్తం 10 లీటర్లు పట్టుకుని, వీరిద్దరిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ బీ. శ్రీనివాసరావు తెలిపారు.

గ్యాస్‌లీకై పూరిల్లు దగ్ధం


కాలిపోయిన వస్తువులు, నగదు

తాళ్లపూడి, మే 23 (ఆంధ్రజోతి): రావూరుపాడుకు చెందిన మేకా సత్తెమ్మ పూరింటిలో గ్యాస్ లీకవ్వడంతో ఇల్లుపూర్తిగా కాలిపోయింది. ఈమె పాత ఇంటి స్థానంలో నూతన ఇంటి నిర్మాణం మొదలుపెట్టారు. ఈ క్రమంలో వారి ఇంటి నిర్మాణం జరుగుతున్న ఆవరణలోనే చిన్నపాక వేసుకుని ఉంటున్నారు. కాగా శుక్రవారం సాయంత్రం వంట చేసేటప్పుడు గ్యాస్ పైపు నుంచి గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ఇంటిలోని సామాన్లు, బట్టలు, నగదు కాలిపోయాయి. ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

రాజమహేంద్రవరం, మే 23 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మండలం తాడిమళ్లకి చెందిన దేశాల ప్రవీణ్ ఇప్పటివరకు 12 చైన్‌స్నాచింగ్ కేసుల్లో నిందితుడిగా ఉండడంతో అతన్ని అరెస్టు చేసినట్టు త్రీటౌన్ సీఐ వి.అప్పారావు తెలిపారు. ఈ మేరకు సీఐ వివరాలు వెల్లడిస్తూ.. ఈయన కోడిపందేలు, జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు చేస్తున్నాడన్నారు. చోరీసొత్తును కొంతకాలం తన వద్దే ఉంచుకొని.. కొద్దిరోజుల తర్వాత విక్రయిస్తుంటాడన్నారు. ఈక్రమంలో రాజమండ్రి వస్తుండగా అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. సుమారు రూ.13 లక్షలు విలువ చేసే 130 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసులో ప్రతిభచూపిన డీఎస్పీ కె.రమేష్ బాబు, సీఐ అప్పారావు, ఎస్‌ఐ వి. అప్పలరాజు, సీసీఎస్ సీఐ శ్రీధర్ కుమార్, ఎస్‌ఐలు ఆనందరెడ్డి, బీఎన్‌కే స్వామి, హెచ్‌సీలు ప్రసాద్, వెంకట రమణ, పీసీ సురేశ్‌ను ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించారు.

రేషన్‌కార్డుల నమోదులో ఇబ్బందులు తొలగించాలి

కొవ్వూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కార్డుల కోసం ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని టీడీపీ నేత కేవీకే రంగారావు అన్నారు. కార్డులో కొత్తగా పేరు చేర్చాలన్నా, తొలగించాలన్నా సర్వర్లు పనిచేయడం లేదన్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన హౌస్ మ్యాపింగ్‌లో అనేక లోపాలున్నాయన్నారు. ఆధార్ ఆధారంగా దరఖాస్తులు స్వీకరించి, సంబంధిత వీఆర్వో, పంచాయతీ కార్యదర్శుల ధ్రువీకరణతో నమోదుకు అవకాశం ఇవ్వాలన్నారు.

అనధికార కట్టడాలను క్రమబద్ధీకరించుకోవాలి

చాగల్లు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో అభ్యంతరం లేని అనధికారిక కట్టడాలను క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ ఎం.మెరికమ్మ శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో అనధికారికంగా నిర్మించిన పక్కా ఇంటి నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తూ రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం క్రమబద్ధీకరణకు సంబంధించి ఇంటి యజమానులు ఇంటిపన్ను, కరెంటు బిల్లులతో తమ వార్డు, గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తివివరాలకు సచివాలయాలను సంప్రదించాలన్నారు.

అభయాంజనేయుడికి విశేష పూజలు


చాగల్లులో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

చాగల్లు, మే 23 (ఆంధ్రజ్యోతి): చాగల్లు సెంటర్‌లోని అభయాంజేయస్వామి వారి జయంతి ఉత్సవాలు శుక్రవారమూ వేడుకగా జరిగాయి. స్వామివారికి వేదపండితులచే మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పవిత్రమైన సర్వ నదీ జలాలతో సుగంధ ద్రవ్యాలతో విశేష రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. సాయంత్రం లక్ష తమలపాకులతో పూజలు చేశారు. అనంతరం కలవలపల్లి వారిచే భజన కాలక్షేపం జరిగింది. ఉత్సవకమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కొవ్వూరు, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఉరి పోసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కొత్తపాలెంకు చెందిన ఓలేటి ధర్మారావు(50), అతని భార్య గంగ, ముగ్గురు కొడుకులతో కలిసి వచ్చి పంగిడిలోని దండమూడి సాయి ఇంటి వద్ద పని నిమిత్తం కుదిరారు. శుక్రవారం మధ్యాహ్నం 2-30 గంటల సమయంలో ఓ పాకలో ధర్మారావు రుమాలుతో ఉరి పోసుకున్నాడు. పెద్ద కోడలు కుమారి చూసి వెంటనే కిందకు దింపి అక్కడే ఉన్న సతీష్ సహాయంతో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి మృతిచెందినట్టు ధ్రువీకరించారు.ఆసుపత్రి సమాచారం మేరకు మృతుడి భార్య గంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

మోటారుసైక్లిస్టుకు గాయాలు

కొవ్వూరు, మే 23 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ బస్సు ఢీకొని మోటారుసైక్లిస్టు గాయపడినట్టు కొవ్వూరు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. వివరాల్లోకి వెళితే నిడదవోలు మండలం కోరుమామిడికి చెందిన ఈదూరి దిలీప్ ఈ నెల 22వ తేదీన రాజమహేంద్రవరంలోని ఏవీ అప్పారావు రోడ్డులో గల కేఎస్ఎల్ ఆసుపత్రికి మందుల కోసం వెళ్లి తిరిగి వస్తుండగా... కొవ్వూరు రైల్వేస్టేషన్ వద్దకు వచ్చేసరికి ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. దీంతో బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, దిలీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

సబ్సిడీపై రైతులకు పశువుల దాణా పంపిణీ


రైతులకు పశువుల దాణా అందజేస్తున్న డాక్టర్ సల్మా

పెరవలి, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశు సంవర్ధక శాఖ పాడి రైతులకు ఇస్తున్న పశువుల దాణాను వినియోగించుకోవాలని పశువైద్యాధికారి సల్మా పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన దాణాను ఖండవల్లిలో పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ. వెయ్యి 110 విలువ గల 50 కేజీల బస్తాను 50 శాతం సబ్సిడీపై రూ.550 కే రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. మండలంలో తొలివిడతగా ఖండవల్లి, అన్నవరప్పాడు, నల్లాకులవారిపాలెంలో 72 బస్తాలు పంపిణీ చేశామని ఆమె తెలిపారు.

అవకతవకలు జరిగితే సహించం : డీఎస్‌వో


తహశీల్దార్ కార్యాలయంలో డీలర్లతో మాట్లాడుతున్న డీఎస్‌వో నాగాంజనేయులు

గోపాలపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా పునఃప్రారంభిస్తు న్న రేషన్ డీలర్ల వ్యవస్థలో అవకతవకలు జరిగితే సహించేదిలేదని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి నాగాంజనేయులు హెచ్చరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన శుక్రవారం డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ షాపుల ద్వారా ప్రజాపంపిణీ వ్యవస్థను పునరుద్ధరిం చటం జరుగుతుందన్నారు. సీఎస్‌డీటీ దివాకర్, రేషన్ డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

34 మంది బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


దుర్గేష్ క్యాంపు కార్యాలయంలో బాధితులకు చెక్కులు అందిస్తున్న జనసేన పార్టీ నేతలు

నిడదవోలు, మే 23 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలోని మంత్రి కందుల దుర్గేష్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జనసేన పార్టీ నాయకులు నియోజకవర్గంలోని 34 మంది బాధితులకు రూ.16.20 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సంద ర్భంగా జనసేన పార్టీ నాయకులు మాట్లాడు తూ మంత్రి దుర్గేష్ ఆదేశాలతో బాధితులను ఆదుకునేందుకు సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కులను అందించడం జరిగిందన్నారు. మంత్రి బిజీగా ఉన్న కారణంగా సమయం వృథా కాకూడదనే సదుద్దేశంతో చెక్కులను వారికి అందించామని తెలిపారు. కార్యక్రమంలో నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాలకు చెందిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరిగినా పట్టించుకోరా..?

- తీపర్రు - కాకరపర్రు మధ్య ఇంకా తొలగించని చెట్లకొమ్మలు
- రాత్రిపూట మోటార్ సైకిల్ వెళ్తుండగా ప్రమాదానికి గురైన ఓ వ్యక్తి


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సూర్యనారాయణ

పెరవలి, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం ... ఒక వ్యక్తి ప్రాణాలు మీదకు తెచ్చింది. ఇటీవల గాలిదుమారాలకు ఆర్‌అండ్‌బీ రహదారిపై చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. దీనిపై ఈనెల 17న 'రోడ్లపై చెట్లకొమ్మలు తొలగించరూ' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితమైంది. అయినప్పటికీ అధికారులు ఏ మాత్రం స్పందించ లేదు. వివరాల్లోకి వెళితే .. తీపర్రు - కాకరపర్రు మధ్య గ్యాస్ గోడౌన్ సమీపంలో ఒక చెట్టుకొమ్మ రోడ్డుపై పడి ఉండటంతో కానూరు అగ్రహారానికి చెందిన సూర్యనారాయణమూర్తి అటుగా వెళ్లి ప్రమాదానికి గురయ్యాడు. పెరవలి వైపు నుంచి స్వగ్రామమైన కానూరు అగ్రహారానికి మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా గురువారం రాత్రి చిమ్మ చీకట్లో రోడ్డు మార్జిన్‌లో పడి ఉన్న ఓ కొమ్మ కనిపించక దానిపై పడిపోయాడు. దీంతో తొడభాగంలో కొమ్మ చొచ్చుకుపోయింది. దీన్ని గమనించిన తీపర్రుకు చెందిన కొందరు యువకులు వచ్చి వెంటనే 108 వాహనానికి ఫోన్ చేశారు. సదరు వ్యక్తి వాహనంలో కనీసం పడుకోలేకపోవడంతో ఇద్దరు వ్యక్తులు పట్టుకున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పినా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. ఇకనైనా చర్యలు తీసుకోవాలని స్థానికులతోపాటు బాధితులు కోరుతున్నారు.

'ఆయిల్ ఫామ్ పంట విస్తీర్ణం పెంచాలి'


మాట్లాడుతున్న త్రీఎఫ్ సంస్థ మేనేజర్ విజయప్రసాద్

గోపాలపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆయిల్‌ఫాం పంట విస్తీర్ణం పెంచాలని త్రీఎఫ్ సంస్థ మేనేజర్ విజయప్రసాద్ అన్నారు. శుక్రవారం పుల్లలపాడులో త్రీఎఫ్, ఉద్యాన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ ఫాం పంటపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. విజయ ప్రసాద్ మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉద్యానపంటలకు డిమాండ్ ఉంటుందని, రైతులు ప్రస్తుతం సబ్సిడీపై వచ్చే మొక్కలను వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు నందమూరి రామకృష్ణ, అల్లూరి హరిచంద్రం, బలుసు దామోదరం, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- తీపర్రు వద్ద దిగబడిపోయిన అప్రోచ్ రోడ్డు


ప్రమాదకరంగా తయారైన అప్రోచ్ రోడ్డు

పెరవలి, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీపర్రు వద్ద గల నిడదవోలు - నరసాపురం కాలువపై గల వంతెనపై అప్రోచ్ రోడ్డు దిగబడిపోయింది. ఇది సుమారు 10 నెలల క్రితమే జరిగింది. ఈ విషయాన్ని అప్పట్లో మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి స్థానికులతో పాటు 'ఆంధ్రజ్యోతి' కూడా తీసుకెళ్లింది. అయితే అప్పట్లో నిండుగా కాలువ ప్రవహించడంతో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడం కుదరదని, తాత్కాలికంగా వెదురు తడికలు అమర్చి కొద్దిపాటి మట్టి పూడ్చి కాలువలు కట్టి వేసిన అనంతరం పూర్తిస్థాయిలో మరమ్మతులు చేస్తామని అధికారులు చెప్పారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు ఆ మట్టి మరింత దిగబడిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ వంతెన మీదుగా ప్రతి నిత్యం సుమారు 100 నుంచి 150 వరకు పెద్ద వాహనాలు, 300 వరకు మోటారు సైకిళ్లు, ఆటోలు ప్రయాణిస్తుంటాయి. రాత్రి సమయంలో అయితే అనుకోని ప్రమాదాలు జరగడం ఖాయమని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికీ కాలువలు కట్టి సుమారు నెలరోజులైనా ... ఇక్కడ ఎటువంటి మరమ్మతులు చేయలేదు. మరికొన్ని రోజుల్లో కాలువలకు నీరు వదులుతారని, వర్షాకాలంలో ఈ రోడ్డు మార్జిన్ మరింత దిగబడిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి వర్యులు వెంటనే దీనిపై దృష్టిసారించి అధికారులతో మాట్లాడి ఈ పని పూర్తిచేసేలా చూడాలని కోరుతున్నారు.